www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 4 సంచిక -20 సోమవారం 4 మే 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు -8 వెల - 3/- 

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

# గెలిచేదెవరో...?

## నేడు ఎన్నికల ఫలితాలు -ఎగ్జిట్ పోల్స్‌లో నిఖార్సెంత..?

## తేలనున్న కేరళ, తమిళనాడు, అసోం, పుదుచ్చేరి, పశ్చిమ బెంగాల్ భవితవ్యం

**చెన్నై మే 3,(ప్రజావినికిడి):**

ఇటీవల జరిగిన నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్రపాలిత ప్రాంతం అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు సోమవారం వెలువడనున్నాయి. కేరళ, తమిళనాడు, అసోం, పుదుచ్చేరి, పశ్చిమబెంగాల్‌లో నేడు ఓట్ల లెక్కింపు ప్రారంభంకానుంది. ఈ ఎన్నికల ఫలితాలు దేశ భవిష్యత్ రాజకీయాలకు దిశానిర్దేశం చేయనున్నాయి. వామపక్షాలు, టీఎంసీ, డీఎంకే, కాంగ్రెస్, బీజేపీలకు ఈ ఫలితాలు కీలకం కానున్నాయి.

### పటిష్ట భద్రత

పై రాష్ట్రాల్లో ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో మూడంచెల భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేశారు. ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు మొదలవుతుంది. ఓట్ల లెక్కింపు కేంద్రాల్లోకి అనధికార వ్యక్తుల ప్రవేశాన్ని నిరోధించేందుకు, **మిగతా 2లో...**




# ఒప్పందం చేసుకోండి..

# లేకుంటే విపత్తే

### ట్రంప్ బెదిరింపులు

### దౌత్యమా..యుద్ధమా.. నిర్ణయించుకోవాల్సింది అమెరికానే : ఇరాన్



**మే 3,(ప్రజావినికిడి):**

అమెరికా, ఇరాన్‌ల మధ్య కాల్పుల విరమణ ఉన్నప్పటికీ, ఉద్రిక్తతలు ఏమాత్రం తగ్గడం లేదు. ఒకవేళ ఒప్పందం కుదరకపోతే, ఇరాన్‌పై మళ్లీ దాడి చేయవచ్చని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ స్పష్టంగా పేర్కొన్నారు. దీంతో పాటు మూడు కీలక అంశాలైన అణు కార్యక్రమం, హోర్ముజ్ దిగ్బంధనం, భద్రతా హామీలు వంటి అంశాలపై ఇప్పటికీ ప్రతిష్టంభన**మిగతా 2లో...**



# నీట్ ప్రశాంతం

**అమరావతి మే 3,(ప్రజావినికిడి):**

వైద్య విద్య కోర్సుల ప్రవేశాలకు సంబంధించిన జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష(నీట్)-2026 ఆది వారం ప్రశాంతంగా జరిగింది. నేషనల్ టెస్టింట్ ఏజెన్సీ(ఎన్‌టిఎ) దేశవ్యాప్తంగా ఈ పరీక్ష నిర్వహించింది. దేశవ్యాప్తంగా 22.79 లక్షల మంది విద్యార్థులు ఈ పరీక్షకు దరఖాస్తు చేసుకు న్నారు. మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన ఈ పరీక్షకు దేశవ్యాప్తంగా 552 పట్టణాల్లో, విదేశాల్లోని 14 పట్టణాల్లో కలిపి 5,432 పరీక్ష కేంద్రాల్లో ఈ పరీక్ష జరిగింది. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 గంటల వరకు విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించింది. ఆ తరువాత ఎవరినీ అనుమ తించలేదు.**మిగతా 2లో...**

# బకాయిలు ఎలా?

### సింగరేణి సంస్థకు విద్యుత్ శాఖ బకాయి

### అన్నీ ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థల నుంచే!..

### నేడు క్యాబినెట్‌లో వాటి రికవరీపై చర్చ

### వాయిదాల వారీ చెల్లించే అంశంపై నిర్ణయం..

### భూముల విలువల రెట్టింపు.. బహదూర్‌గూడలో బస్ టెర్మినల్ ఏర్పాటుపైనా చర్చ

### విద్యుత్తు సబ్‌స్టేషన్ల పక్కన సోలార్ ప్లాంట్ల నిర్మాణం.. ఖజానాకు వనరుల సమీకరణ..

### ఆర్టీసీ విలీనం.. ఉద్యోగులకు 6 వేల కోట్ల చెల్లింపుపైనా చర్చించనున్న క్యాబినెట్



**హైదరాబాద్, మే 3,(ప్రజావినికిడి):**

రాష్ట్రంలో విద్యుత్ శాఖకు వివిధ ప్రభుత్వ సంస్థల నుంచి పెద్దమొత్తంలో బకాయిలు ఉన్న విషయాన్ని సర్కారు తీవ్రంగా పరిగణిస్తోంది. ఇరిగేషన్ శాఖ నుంచి పలు ఎత్తిపోతల పథకాలకు సంబంధించి రూ.26 వేల కోట్లు, మిషన్ భగీరథ రూ.5వేల కోట్లు, పంచాయతీరాజ్, మునిసిపాలిటీలు కలిపి రూ.6 వేల కోట్లతోపాటు పలు**మిగతా 2లో...**



# నింగిలోకి మిషన్ దృష్టి

### భారత ప్రైవేట్ అంతరిక్ష రంగంలో నవశకం..

### బెంగళూరు స్టార్టప్ గెలాక్సీఐ స్పేస్ 'మిషన్ దృష్టి' శాటిలైట్ విజయవంతం

### స్పేస్‌ఎక్స్ ఫాల్కన్ 9 రాకెట్ ద్వారా నింగిలోకి ప్రయోగం

### దేశంలోనే ప్రైవేటుగా నిర్మించిన అతిపెద్ద శాటిలైట్‌గా రికార్డు

### ఇది భారత యువత ఆవిష్కరణల పట్ల ఉన్న అభిరుచికి నిదర్శనమన్న ప్రధాని మోదీ

**2లో.**

# కరీంనగర్‌లో పట్టపగలే తుపాకుల మోత

### పీఎంజే జ్యువెలరీలో 'సినిమా ఫక్కీ'లో రక్తపాతం..భారీ దోపిడీ

### కస్టమర్ల ముసుగులో వచ్చి రెచ్చిపోయిన ఐదుగురు దుండగులు

### నగలు దోచుకుంటూ.. అడ్డుకున్న సిబ్బందిపై విచక్షణారహితంగా కాల్పులు

### రక్తపు మడుగులో నలుగురు ఉద్యోగులు.. ఒకరి పరిస్థితి విషమం




**2లో.**

# 'స్వచ్ఛ రథం' సూపర్ హిట్

### పంచాయతీల్లో భారీగా ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణ

### రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో సిద్ధమైన వాహనాలు



**అమరావతి, మే 3,(ప్రజావినికిడి):**

రాష్ట్రవ్యాప్తంగా గ్రామ పంచాయతీల్లో 'స్వచ్ఛ రథం' దూసుకుపోతోంది. గ్రామాల్లో ప్లాస్టిక్, ఇతర పొడి వ్యర్థాలను నిరోధించేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ తీసుకొచ్చిన ఈ పథకం సత్ఫలితాలనిస్తోంది. 'చెత్తతో సంపద' నినాదంతో ఒక్క ఏప్రిల్‌లోనే రాష్ట్రవ్యాప్తంగా**మిగతా 2లో...**

# పవన్ కల్యాణ్ 'మ్యాజిక్ డ్రెయిన్స్' ఒక గేమ్ ఛేంజర్

### ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆలోచనలను ప్రశంసించిన పీవీ సింధు

### 'మ్యాజిక్ డ్రెయిన్స్' గ్రామీణ పారిశుద్ధ్యంలో విప్లవాత్మక మార్పు అని వ్యాఖ్య

### సాధారణ డ్రెయిన్లతో పోలిస్తే 80 శాతం ఖర్చు ఆదా అవుతుందని వెల్లడి

### పవన్ ముందుచూపుతో మరిన్ని కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్ష

**హైదరాబాద్,మే 3,(ప్రజావినికిడి):**

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వినూత్న ఆలోచనలతో గ్రామీణాంధ్రప్రదేశ్ రూపురేఖలు మారుస్తున్నారని, ఆయన ప్రవేశపెట్టిన 'మ్యాజిక్ డ్రెయిన్స్' పథకం పల్లెల్లో పారిశుద్ధ్య విప్లవానికి నాంది పలికిందని ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి, ఒలింపిక్ పతక విజేత పీవీ సింధు కొనియాడారు. పవన్ కల్యాణ్ 20 నెలల పాలనపై తన అభిప్రాయాలను పంచుకుంటూ విడుదల చేసిన ఒక వీడియో సందేశంలో, గ్రామీణ ప్రాంతాల్లోని మురుగునీటి సమస్యకు **మిగతా 2లో...**



# గెలిచేదెవరో...?

**మొదటిపేజీ తరువాయి**

ఎన్నికల సంఘం (ఈసీ) ఈసారి వినూత్నంగా క్యూఆర్ కోడ్ ఆధారిత ఫోటో గుర్తింపు కార్డు విధానాన్ని ప్రవేశపెట్టింది. పశ్చిమ బెంగాల్‌లోని 293 అసెంబ్లీ స్థానాల లెక్కింపు 77 కౌంటింగ్ కేంద్రాల్లో జరగనున్నది. ఈ రాష్ట్రంలో రెండు దశల్లో ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. ఇక్కడ గతంలో ఎన్నడూ లేనట్టు 92.47 శాతం అత్యధిక ఓటింగ్ శాతం నమోదైంది. అలాగే ఇక్కడి దక్షిణ 24 పరగణాల జిల్లాలోని 'ఫాల్తా' నియోజకవర్గంలో ఎన్నికల నిర్వహణలో ఉల్లంఘనలు జరిగిన కారణంగా అక్కడి ఎన్నికలను రద్దు చేశారు . ఆ స్థానానికి మే 21న తిరిగి ఎన్నికలు జరగనున్నాయి. అసోంలో 126 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి 722 మంది అభ్యర్థుల ఎన్నికల భవితవ్యం నేడు వెల్లడికానుంది. ఇక్కడ 40 కౌంటింగ్ కేంద్రాల్లో ఓట్ల లెక్కింపు జరుగుతున్నది.



కేరళలో రెండు పర్యాయాలుగా అధికారంలో ఉన్న లెఫ్ట్ డెమోక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డీఎఫ్) మూడోసారి కూడా అధికారాన్ని కైవసం చేసుకుంటుందని ఆ కూటమి నేతలు ధీమా వ్యక్తంచేస్తున్నారు. ఇక్కడ 140 అసెంబ్లీ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో 883 మంది అభ్యర్థులు పోటీపడ్డారు. మొత్తం 140 కౌంటింగ్ కేంద్రాలను కేంద్ర ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది. తమిళనాడులో అధికారంలో ఉన్న డీఎంకే పార్టీ వరుసగా రెండోసారి అధికారాన్ని దక్కించుకోవాలని ఆశిస్తోంది. ఇక్కడి ఎన్నికలువిభిన్నమైన రాజకీయ వాతావరణంలో జరిగాయి. డీఎంకే ప్రధాన ప్రత్యర్థి అయిన ఏఐడీఎంకేతో పాటు, నటుడు, రాజకీయ నాయకుడు విజరు నేతృత్వంలోని టీవీకే వంటి కొత్త పార్టీలు కూడా ఈసారి ఎన్నికల బరిలో నిలిచాయి.

### ఎగ్జిట్ పోల్స్‌లో నిఖార్సెంత..?

ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు పోలింగ్ ముగిశాక..మోడీ అనుకూల కార్పొరేట్ మీడియా ఎగ్జిట్ పోల్స్‌ను విడుదల చేసింది. అందులో తమకు అనుకూలమైన రీతిలో సీట్లు వస్తాయని ప్రచారం చేసుకున్నాయి. వాస్తవానికి ఇప్పటికీ ఓటరు నాడి ఏమిటో అంతుచిక్కలేదు. ఎగ్జిట్ పోల్స్ ప్రకటించాక కూడా భిన్నమైన ఫలితాలతో అసెంబ్లీ ముఖ చిత్రాలు మారిన చరిత్ర గతంలో ఉంది. అంతిమంగా బ్యాలెట్ బాక్సుల్లో అభ్యర్థులు, పార్టీల భవితవ్యం భద్రంగా ఉంది. ఉదయం 11 గంటలలోపు తొలి ట్రెండ్ ఫలితాలు వచ్చే అవకాశాలు ఉన్నాయి.

# కరీంనగర్‌లో పట్టపగలే తుపాకుల మోత

## పీఎంజే జ్యువెలరీలో 'సినిమా ఫక్కీ'లో రక్తపాతం..భారీ దోపిడీ

**కరీంనగర్ మే 3,(ప్రజావినికిడి):**
కరీంనగర్ నగరం నడిబొడ్డున, ప్రశాంతంగా గడిచిపోతున్న ఆదివారం ఉదయం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. జ్యోతినగర్‌లోని అత్యంత రద్దీ ప్రాంతంలో ఉన్న ప్రముఖ పీఎంజే జ్యువెలరీ షోరూమ్‌లో పట్టపగలు తుపాకుల మోత మోగింది. అత్యంత పకడ్బందీగా, పక్కా స్కెచ్‌తో కస్టమర్ల ముసుగులో లోపలికి ప్రవేశించిన ఐదుగురు దుండగులు క్షణాల్లోనే తుపాకులతో భయానక వాతావరణం సష్టించారు. హాలీవుడ్ క్రైమ్ థ్రిల్లర్‌ను తలపించేలా అడ్డుకోబోయిన సిబ్బందిపై విచక్షణారహితంగా కాల్పులకు తెగబడి, నెత్తుటేరులు పారించి, పెద్ద ఎత్తున బంగారు ఆభరణాలతో పరారయ్యారు. ఈ దుస్సాహస ఘటన యావత్ తెలంగాణలో కలకలం రేపగా, దొంగల వేట కోసం పోలీస్ యంత్రాంగం నగరవ్యాప్తంగా నాకాబందీ విధించి జల్లెడ పడుతోంది. ఉదయం 10.45 గంటల ప్రాంతం. సిబ్బంది లాకర్ల నుంచి నగలు తీసి డిస్‌ప్లేలో పెడుతున్నారు. పక్కాగా రెక్కీ నిర్వహించిన దొంగలు.. అత్యంత అనువైన సమయం చూసి దాడికి దిగారు. రెండు బైక్‌లపై (బ్లాక్ పల్సర్, వైట్ అపాచీ) ఐదుగురు వ్యక్తులు వచ్చారు. ముందుగా ఒకరు లోపలికి వచ్చి 20 గ్రాముల చైన్ కావాలని అడిగాడు. సిబ్బంది చూపిస్తున్న క్రమంలోనే మిగతా నలుగురు లోపలికి ప్రవేశించారు. కస్టమర్ల ముసుగులో వచ్చిన వారు క్షణాల్లో తుపాకులు బయటకు తీశారు. భయానక వాతావరణం సష్టించి, షట్టర్లు మూసేసి షోరూమ్‌ను తమ గుప్పిట్లోకి తీసుకున్నారు.

ప్రాణాలకు తెగించిన సిబ్బంది..
లోపలికి రాగానే దొంగలు సిబ్బంది చేతులు వెనక్కి కట్టేసి లాకర్లు తెరవాలని బెదిరించారు. వాష్‌రూమ్‌లో భయంతో దాక్కున్న ఓ మహిళను సైతం బయటకు లాక్కొచ్చి నింపాదిగా నగలు బ్యాగుల్లో సర్దుకున్నారు. అయితే, ఈ



క్రమంలో షోరూమ్ మేనేజర్, సెక్యూరిటీ, ఇతర సిబ్బంది ప్రాణాలకు తెగించి వారిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఊహించని ఈ పరిణామంతో ఖంగుతిన్న దొంగలు విచక్షణారహితంగా 7 నుంచి 8 రౌండ్ల కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో నలుగురు ఉద్యోగులు బుల్లెట్ గాయాలతో రక్తపు మడుగులో కుప్పకూలారు. వీరిలో ఒకరి తలకు గాయం కావడంతో పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.

### పారిపోతూ గాలిలోకి ఫైరింగ్.. దొరికిన కీలక ఆధారాలు

నగలు దోచుకున్న అనంతరం దుండగులు బయటకు పరుగులు తీశారు. అప్పుడు కూడా గాయాలతోనే సిబ్బంది వారిని వెంబడించగా, దొంగలు గాలిలోకి కాల్పులు జరుపుతూ బైక్‌లు స్టార్ట్ చేశారు. ఆ కంగారులో ఒక దొంగ కిందపడిపోగా, నగలున్న ఓ బ్యాగ్ కూడా అక్కడే పడిపోయింది. అంతేకాకుండా, వారి తుపాకీకి చెందిన మ్యాగజైన్, మూడు ఖాళీ బుల్లెట్ షెల్స్, ఒక కత్తి ఘటనా స్థలంలో పడిపోయాయి. వారు హిందీ, తెలుగు మాట్లాడుతున్నారని, ఉత్తరాదికి చెందిన అంతర్రాష్ట్ర ముఠాగా అనుమానిస్తున్నారు. వీరు సిరిసిల్ల వైపు పరారైనట్లు పోలీసులు గుర్తించారు.
సమాచారం అందుకున్న వెంటనే ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి, కరీంనగర్ సీపీ గౌష్ ఆలం హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ రంగంలోకి దిగాయి. సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా మాస్కులు లేని నలుగురు నిందితుల ఫొటోలను పోలీసులు విడుదల చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా సరిహద్దులను దిగ్బంధించి హై అలర్ట్ ప్రకటించారు. ఘటనా స్థలంలో దొరికిన మ్యాగజైన్, తూటాలు కంట్రీ మేడ్ వెపన్స్‌వా? లేక ఎక్కడైనా కొనుగోలు చేశారా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.
ఈ ఘటన జరిగిన సమయానికి సమీపంలోనే ఉన్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజరు కుమార్ వెంటనే షోరూమ్ వద్దకు చేరుకున్నారు. సిబ్బంది చూపిన తెగువను ప్రశంసించిన ఆయన, మెరుగైన వైద్యం కోసం బాధితులను హైదరాబాద్ తరలిస్తున్నట్లు వెల్లడించారు. అలాగే, హుజూరాబాద్ ఎమ్మెల్యే, కాంగ్రెస్ డీసీసీ అధ్యక్షులు మేడిపల్లి సత్యం, ఎమ్మెల్యేలు గంగుల కమలాకర్, పాడి కౌశిక్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుంకే రవిశంకర్ తదితరులు స్థానిక ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. కాంగ్రెస్ నేత వెలిచాల రాజేందర్ రావు స్పందిస్తూ.. ప్రభుత్వం తరఫున అన్ని విధాలా ఆదుకుంటామని, పోలీసులు అహర్నిశలు శ్రమిస్తున్నారని, ప్రజలు ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు.

**ప్రజలకు పోలీసుల విజ్ఞప్తి**

సీసీటీవీ ఫుటేజీలో కనిపించిన వ్యక్తులను ఎవరైనా గుర్తించినా, లేదా బ్లాక్ కలర్ పల్సర్ బైక్, వైట్ కలర్ అపాచీ బైక్‌లపై అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులు కనిపించినా.. వెంటనే డయల్ 100 లేదా 8712670744, 8712670745 నంబర్లకు సమాచారం అందించాలని కరీంనగర్ పోలీసులు జిల్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# బకాయిలు ఎలా?

**మొదటిపేజీ తరువాయి**

ప్రభుత్వ కార్యాలయాలు, సంస్థలు కలిపి మొత్తం సుమారు రూ.55 వేల కోట్లకు పైగా విద్యుత్ శాఖకు చెల్లించాల్సి ఉంది. ఇటీవల నిర్వహించిన పలు సమీక్షల్లో అధికారులు ఈ బకాయిల అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. మరోవైపు విద్యుత్ శాఖ కూడా సింగరేణి సంస్థకు రూ.వేల కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది. దీంతో ఏవైనా అవసరాల నిమిత్తం ప్రభుత్వం రుణాల కోసం బ్యాంకులు, ఇతర సంస్థల వద్దకు వెళ్లినప్పుడు.. ఈ బకాయిల అంశం తెరపైకి వస్తోంది. రుణాలను తిరిగి చెల్లించేందుకు ఉన్న అవకాశాలు, ప్రస్తుతం శాఖ పరిస్థితిని పరిశీలించి ఆయా బ్యాంకులు, సంస్థలు రుణాలు ఇచ్చేందుకు నిరాకరిస్తున్నాయన్న విషయాన్ని అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. ఈ నేపథ్యంలో సోమవారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరగనున్న మంత్రివర్గ సమావేశంలో బకాయిల అంశంపై చర్చించనున్నట్లు తెలుస్తోంది. ఏయే సంస్థలు ఎంత మేర బకాయిలు ఉన్నాయి, చెల్లింపులకు ఉన్న అవకాశాలేంటన్న దానిపై చర్చించి, వాయిదాల పద్ధతిలో విద్యుత్ శాఖకు చెల్లించేలా నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. దీంతోపాటు పలు కీలక అంశాలపై క్యాబినెట్ భేటీలో చర్చించనున్నారు. రాష్ట్రంలో హైదరాబాద్ మినహా మిగిలిన తొమ్మిది ఉమ్మడి జిల్లాల పరిధిలో జిల్లాకు రెండు చొప్పున సోలార్ పవర్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఉంది. అంతర్జాతీయంగా నెలకొంటున్న యుద్ధ వాతావరణం, రోజురోజుకూ పెరుగుతున్న గ్యాస్ ధరల నేపథ్యంలో సర్కారు ఈ దిశగా ఆలోచిస్తోంది. ప్రతి జిల్లాలోని ఒక నియోజకవర్గంలో ఒక గ్రామాన్ని పైలట్‌గా ఎంపిక చేసి, పూర్తి సోలార్ పవర్‌ను సరఫరా చేయాలని భావిస్తోంది. అంతేకాకుండా ఆ గ్రామాల్లో గ్యాస్ స్టవ్‌లు వాడకుండా పూర్తి సోలార్ స్టవ్‌లను అందించేందుకు ఉన్న అవకాశాలనూ పరిశీలిస్తోంది. ఈ విషయంపైనా మంత్రివర్గంలో చర్చించి ఒక నిర్ణయం తీసుకోనున్నట్టు తెలిసింది. ఇక రాష్ట్ర ఖజానాకు వనరుల సమీకరణపై దృష్టి సారించిన ప్రభుత్వం.. అందుకు ఉన్న అవకాశాలను గుర్తిస్తోంది. ఇప్పటికే పలు సంస్థల పరిధిలోని ఆస్తులను వేలం వేస్తూ ఆదాయం రాబడుతోంది. తాజాగా వనరుల సమీకరణ కోసం ఏర్పాటైన క్యాబినెట్ సబ్ కమిటీ.. ఇటీవల వరుసగా వివిధ ప్రభుత్వ శాఖలతో భేటీ అవుతోంది. ఆ భేటీల్లో వనరుల సమీకరణకు ఉన్న మార్గాలను గుర్తించి ఒక నివేదికను రూపొందించినట్టు తెలిసింది. ఆ నివేదికను క్యాబినెట్ ముందుంచి దానిపై చర్చించనున్నారు. అనంతరం వనరుల సమీకరణకు తీసుకోవాల్సిన చర్యలపై నిర్ణయం తీసుకోనున్నారు. ఆర్టీసీ కార్మికులతో చర్చల సందర్భంగా ఆ సంస్థను ప్రభుత్వంలో విలీనం చేయాలనే డిమాండ్ పట్ల ప్రభుత్వం సానుకూలత వ్యక్తం చేసింది. ఆ కారణంగానే కార్మికులు సమ్మెను విరమించినట్టు ప్రకటించారు. ఈ క్రమంలోనే ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంపై క్యాబినెట్‌లో చర్చించనున్నారు. అలాగే ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 5న ఆందోళన చేపడతామని ఉద్యోగ సంఘాల జేఏసీ ఇచ్చిన ప్రకటన నేపథ్యంలో ప్రభుత్వం వారితోనూ సమావేశమై చర్చలు జరిపింది. వారి సమస్యల్లో కీలకమైన ఆర్థిక అంశాలను పరిష్కరిస్తామని చెప్పింది. ఇందులో భాగంగా రానున్న వంద రోజుల్లో రూ.6వేల కోట్లను చెల్లిస్తామని హామీ ఇచ్చింది. ఈ దృష్ట్యా అందుకు ఉన్న అవకాశాలపైనా చర్చించి, చెల్లింపులపై ప్రకటన చేయనున్నట్లు సమాచారం. పీఆర్సీ, డీఏల వ్యవహారంపైనా నిర్ణయం తీసుకునే అవకాశం ఉందని తెలిసింది. తుమ్మిడిహెట్టి వద్ద 150 మీటర్ల ఎత్తులో బ్యారేజీ నిర్మించి, ఎల్లంపల్లికి నీటిని తరలించే మార్గాలపై క్యాబినెట్‌లో లోతుగా చర్చించనున్నారు. దీంతోపాటు కొత్త రేషన్‌కార్డులు, ఆసరా పింఛన్లు, ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుపైనా చర్చించనున్నారు. ఉద్యమకారుల సంక్షేమ సంఘం విధివిధానాల ఖరారుపై చర్చించనున్నారు.

**బస్ టెర్మినల్, మెట్రో రెండో ఫేజ్‌పై చర్చ**

హైస్పీడ్ రైల్ కారిడార్ కోసం శంషాబాద్‌లోని బహదూర్‌గూడ సమీపంలో ఇప్పటికే 500 ఎకరాల స్థలం అందుబాటులో ఉండగా, మరో 150 ఎకరాలను సేకరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనిపై క్యాబినెట్‌లో చర్చించనున్నారు. అక్కడే హైస్పీడ్ రైలు, మెట్రో, బస్సులతోపాటు విమానాశ్రయానికి వెళ్లేందుకు వీలుగా ఇంటర్‌స్టేట్ బస్ టెర్మినల్ పేరుతో భారీ నిర్మాణాన్ని చేపట్టే అంశంపైనా చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. కాగా, మెట్రో రెండో ఫేజ్‌ను ఏ పద్ధతిలో నిర్మించాలి, పీపీపీ మోడల్‌లో ముందుకు వెళ్లాలా, లేక కేంద్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో వెళ్లాలా అనేదానిపై చర్చించనున్నారు. ఇప్పటికే కేంద్రానికి ప్రతిపాదనలు పంపగా, మరోసారి డీపీఆర్‌ను పంపించి.. నిధులు, సంబరొధిత అంశాలకు సహకరించాలని కోరే విషయంపై కీలకంగా చర్చించనున్నట్టు తెలిసింది. ఇక ఐఐటీ-బాసర (ఆర్‌జీయూకేటీ)కు యూనివర్సిటీ హోదా కల్పించే అంశంపైనా క్యాబినెట్ భేటీలో చర్చించనున్నారు. హైబ్రిడ్ యాన్యునిటీ మోడ్ (హ్యామ్) విధానంలో అభివృద్ధి చేయదలచిన ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖలోని రోడ్ల టెండర్లలో ఎక్సెస్ రేట్ల వ్యవహారం తెరపైకి వచ్చినందున.. దీనిపైనా చర్చించి నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిసింది.

**కార్పొరేషన్ల చైర్మన్ల జాబితా సిద్ధం!**

రాష్ట్ర వ్యాప్తంగా పలు కార్పొరేషన్లకు కొత్త చైర్మన్‌లను నియమించాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రస్తుతం ఉన్న చైర్మన్‌ల పదవీకాలం పూర్తికానున్న నేపథ్యంలో కొత్త వారిని నియమించనున్నారు. ఇందుకు సంబంధించిన జాబితా కూడా సిద్ధమైనట్లు, దీనిపై క్యాబినెట్‌లో చర్చించనున్నట్టు తెలిసింది. ప్రస్తుతం ఉన్నవారిలో ఐదారుగురు మినహా మిగిలిన వారందరినీ కొత్త వారిని నియమించనున్నట్లు సమాచారం. ఒకటి, రెండు రోజుల్లోనే ఈ ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉందని అధికార వర్గాల ద్వారా తెలిసింది.

# ఒప్పందం చేసుకోండి.. లేకుంటే విపత్తే

**మొదటిపేజీ తరువాయి**

కొనసాగుతోంది. మరోవైపు ట్రంప్ ను ఏమాత్రం నమ్మలేమని ఇరాన్ అంటోంది. సముద్రపు దొంగల్లాంటి వాళ్లమంటూ ప్రకటనతో కూడా ఇరాన్ మరింత అప్రమత్తమైంది. అందుకే మా వ్యూహాల్లో మేం ఉన్నామంటూ ప్రతిస్పందిస్తోంది. దీంతో యుద్ధం జరగవచ్చనే భయాన్ని రేకెత్తిస్తోంది.
ప్రతి వారం కొత్త సవరణలతో ప్రతిపాదనలు వస్తున్నా, ఏవీ ఆమోదం పొందడం లేదు. ఇరాన్ ఒకప్పుడు ఉన్నంత బలంగా ఇప్పుడు లేదని ట్రంప్ అంటున్నారు. ఆయన ప్రకారం, వారికి ఒప్పందం కావాలి. వారు పూర్తిగా బలహీనపడ్డారు. తమ నాయకుడు ఎవరో కూడా వారికి అర్థం కావడం లేదు. వారు నిస్సహాయులు. అని యూఎస్ అధ్యక్షుడు పేర్కొంటున్నారు. ఒప్పందం కుదరకపోతే ఏమి జరుగుతుందనేదే అతిపెద్ద ప్రశ్న. సైనిక చర్య ఒక ప్రత్యామ్నాయం అని ట్రంప్ స్పష్టంగా పేర్కొన్నారు.
"నేను ఇప్పుడే చెప్పలేను, కానీ వారు తప్పుడు నిర్ణయం తీసుకుంటే, అది సాధ్యమే" అని ఆయన అన్నారు. అమెరికా దాడి చేసే అవకాశాన్ని తెరిచి ఉంచుకుంటోందని ఇది స్పష్టంగా సూచిస్తోంది. ఇదిలా ఉండగా, హార్ముజ్ జలసంధిపై ఉద్రిక్తతలు తీవ్రమవుతూనే ఉన్నాయి. అమెరికా దిగ్బంధనం ఇరాన్ ఆర్థిక పరిస్థితిపై ప్రభావం చూపింది.
ఇరాన్‌పై సైనిక చర్యకు అవకాశం ఉన్నదని ట్రంప్ సూచనప్రాయంగా చెప్పారు. 'వారి ప్రవర్తన సరిగా లేకపోతే, వారు చెడ్డ పని చేస్తే ఏం చేయాలో చేస్తాం. సైనిక చర్యకు అవకాశం ఉంది కచ్చితంగా' అని ఆయన ఫ్లోరిడాలో తెలిపారు. కాగా ఇరాన్‌పై యుద్ధం చేయడానికి తనకు కాంగ్రెస్ అనుమతి అవసరం లేదని ట్రంప్ స్పష్టం చేశారు. అమెరికా చట్టం ప్రకారం సైనిక చర్య చేపట్టాలంటే దేశాధ్యక్షుడికి ప్రతినిధిసభ అనుమతి తప్పనిసరి. అయితే ట్రంప్ తాజాగా కాంగ్రెస్ సభ్యులకు లేఖ రాస్తూ యుద్ధ అధికారాల చట్టానికి తాను కట్టుబడి ఉండాల్సిన అవసరం లేదని తేల్చి చెప్పారు. ఇరాన్‌తో కుదుర్చుకున్న కాల్పుల విరమణ ఒప్పందం ఏప్రిల్ 7వ తేదీ నుంచి కొనసాగుతోందని, కాబట్టి ఫిబ్రవరి 28న ప్రారంభమైన శత్రుత్వం ముగిసిందని గుర్తు చేశారు. ఇదిలావుండగా హార్ముజ్ జలసంధి మీదుగా ప్రయాణించేందుకు ఇరాన్‌కు వ్యక్తులు కానీ, కంపెనీలు కానీ టోల్ చెల్లిస్తే తమ ఆంక్షలను ఉల్లంఘించినట్లు అవుతుందని అమెరికా ఆర్థిక శాఖ ఓ నోటీసులో హెచ్చరించింది.

# నింగిలోకి మిషన్ దృష్టి

## భారత ప్రైవేట్ అంతరిక్ష రంగంలో నవశకం..

**హైదరాబాద్, మే 3,(ప్రజావినికిడి):**
భారత ప్రైవేట్ అంతరిక్ష రంగంలో చారిత్రక ఘట్టం ఆవిష్కృతమైంది. బెంగళూరు కేంద్రంగా పనిచేస్తున్న స్టార్టప్ 'గెలాక్సీఐ స్పేస్' అభివృద్ధి చేసిన 'మిషన్ దృష్టి' శాటిలైట్‌ను ఆదివారం విజయవంతంగా ప్రయోగించారు. స్పేస్‌ఎక్స్ ఫాల్కన్ 9 రాకెట్ ద్వారా ఈ ఉపగ్రహాన్ని నింగిలోకి పంపారు. దేశీయ ప్రైవేట్ అంతరిక్ష పర్యావరణ వ్యవస్థలో ఇది ఒక కీలక ముందడుగుగా నిపుణులు అభివర్ణిస్తున్నారు.సుమారు 190 కిలోల బరువున్న 'మిషన్ దృష్టి', ఇప్పటివరకు ఒక భారతీయ ప్రైవేట్ సంస్థ నిర్మించిన అతిపెద్ద ఉపగ్రహంగా రికార్డు సృష్టించింది. అంతేకాకుండా, ఇది ప్రపంచంలోనే మొట్టమొదటి 'ఆప్టోసార్' (రాజుశీూా=) టెక్నాలజీ కలిగిన శాటిలైట్ కావడం విశేషం. ఈ విజయంతో గెలాక్సీఐ స్పేస్, అంతరిక్ష సాంకేతికతలో సరికొత్త హద్దులను చెరిపేస్తున్న స్టార్టప్‌ల సరసన నిలిచింది.ఈ చారిత్రక విజయంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హర్షం వ్యక్తం చేశారు. గెలాక్సీఐ వ్యవస్థాపకులు, యావత్ బృందానికి ఆయన అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రధాని 'ఎక్స్'లో స్పందిస్తూ, "మన అంతరిక్ష ప్రయాణంలో గెలాక్సీఐ వారి మిషన్ దృష్టి ఒక ప్రధాన విజయాన్ని సూచిస్తుంది. ప్రపంచంలోనే తొలి ఆప్టోసార్ శాటిలైట్, భారతదేశంలో ప్రైవేటుగా నిర్మించిన అతిపెద్ద శాటిలైట్‌ను విజయవంతంగా ప్రయోగించడం మన యువత ఆవిష్కరణల పట్ల, దేశ నిర్మాణం పట్ల ఉన్న అభిరుచికి నిదర్శనం. గెలాక్సీఐ వ్యవస్థాపకులకు, మొత్తం బృందానికి నా హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు" అని పేర్కొన్నారు.

# నీట్ ప్రశాంతం

**మొదటిపేజీ తరువాయి**

దీంతో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పరీక్ష కేంద్రాల వద్ద విద్యార్థులు, తల్లిదండ్రులతో హడావుడి నెలకొంది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 50 వేల మంది దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. 28 పట్టణాల్లో 180 పరీక్ష కేంద్రాలను ఎన్‌టిఎ ఏర్పాటు చేసింది. ఎన్‌టిఆర్ జిల్లాలో ఏర్పాటు చేసిన 32 పరీక్ష కేంద్రాల్లో 11,496 మంది దరఖాస్తు చేసుకోగా, వీరిలో 11,345 మంది పరీక్షకు హాజరయ్యారు. గుంటూరు జిల్లాలో 8,417 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 8,299 మంది, శ్రీకాకుళం జిల్లాలో 1,951 మంది దరఖాస్తుదారులకు 1904 మంది, విశాఖపట్నంలో 8,112 మందికి 7,987 మంది, కర్నూలులో 4,928 మందికి 4,807 మంది హాజరయ్యారు. బయాలజీ, కెమిస్ట్రీ కంటే ఫిజిక్స్ విభాగం కఠినంగా ఉందని విద్యార్థులు చెబుతున్నారు. ఫిజిక్స్ ప్రశ్నలు కఠినంగా ఉండటం వల్ల ఎక్కువ సమయం దానికే వెచ్చించాల్సి వచ్చిందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. నీట్ ఆన్సర్ 'కీ-ని ఎన్‌టిఎ 15 రోజుల్లో విడుదల చేసే అవకాశం ఉంది.

# పవన్ కల్యాణ్ 'మ్యాజిక్ డ్రెయిన్స్' ఒక గేమ్ ఛేంజర్

**మొదటిపేజీ తరువాయి**

ఈ పథకం ఒక అద్భుతమైన పరిష్కారమని ఆమె అభివర్ణించారు.
ఈ సందర్భంగా పీవీ సింధు మాట్లాడుతూ, "పాలనా వ్యవహారాలలో కొత్తే అయినా, పవన్ కల్యాణ్ గారు వినూత్న కార్యక్రమాలతో ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నారు. మన దేశంలో అధిక శాతం ప్రజలు గ్రామాల్లోనే నివసిస్తున్నారు. అయితే, గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ, ముఖ్యంగా మురుగునీటి పారుదల వ్యవస్థ పెద్ద సవాలుగా ఉంటుంది. ఈ సమస్యకు పవన్ కల్యాణ్ గారు 'మ్యాజిక్ డ్రెయిన్స్' రూపంలో ఒక చక్కటి, శాశ్వత పరిష్కారాన్ని కనుగొన్నారు" అని అన్నారు.మ్యాజిక్ డ్రెయిన్స్ పనితీరును వివరిస్తూ, "ఇళ్ల నుంచి వెలువడే మురుగు నీటిని ఇంకుడు గుంతలతో కూడిన ఈ డ్రెయిన్లు క్షణాల్లో భూమిలోకి ఇంకేలా చేస్తాయి. మూడంచెల ఫిల్టర్ బెడ్ల ద్వారా నీటిని శుద్ధి చేసి, భూగర్భ జలంగా మారుస్తాయి. దీనివల్ల మురుగునీరు నిల్వ ఉండటం, దుర్వాసన రావడం వంటి సమస్యలు పూర్తిగా తొలగిపోతాయి. గ్రామీణ ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ఈ డ్రెయిన్లు కీలక పాత్ర పోషిస్తాయి" అని సింధు వివరించారు.
ఈ పథకం వల్ల ఖర్చు కూడా గణనీయంగా ఆదా అవుతుందని ఆమె పేర్కొన్నారు. సాధారణ సిమెంట్ డ్రెయిన్ల నిర్మాణంతో పోలిస్తే, మ్యాజిక్ డ్రెయిన్ల నిర్మాణ వ్యయం 80 శాతం వరకు తక్కువగా ఉంటుందని తెలిపారు. ఇది ప్రభుత్వానికి ఆర్థికంగా ఎంతో మేలు చేస్తుందన్నారు.
"పవన్ కల్యాణ్ గారు భవిష్యత్తులో కూడా ఇలాంటి ముందుచూపుతో కూడిన కార్యక్రమాలను మరిన్ని చేపట్టాలని ఆకాంక్షిస్తున్నాను. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సహకారంతో, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో, పవన్ కల్యాణ్ దార్శనికతతో గ్రామీణాంధ్రప్రదేశ్ అన్ని రంగాలలో అభివృద్ధి పథంలో పయనించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని పీవీ సింధు తన సందేశాన్ని ముగించారు.

# 'స్వచ్ఛ రథం' సూపర్ హిట్

**మొదటిపేజీ తరువాయి**

1866 టన్నుల వ్యర్థాలను సేకరించారు. పారిశుధ్య నిర్వహణలో భాగంగా మార్చి నెలాఖరుకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని పంచాయతీల్లో స్వచ్ఛ రథం వాహనాలను ప్రభుత్వం సిద్ధం చేసింది. ఈ క్రమంలో పూర్తిస్థాయిలో కార్యకలాపాలు ప్రారంభించిన మొదటి నెలలోనే రికార్డు స్థాయి ఫలితాలు నమోదయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణుల నుంచి మొత్తంగా 1866 టన్నుల పొడి చెత్తను సేకరించి.. దానికి బదులుగా రూ.3.31 కోట్ల విలువైన నిత్యావసర వస్తువులను అందించారు. ఏప్రిల్ 2న నిర్వహించిన స్కూల్ డే కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల నుంచి ఒక్కరోజే ఒక టన్ను పొడి చెత్తను సేకరించారు. పర్యావరణం పట్ల ప్రజల్లో, విద్యార్థుల్లో పెరుగుతున్న సామాజిక స్పృహకు ఇది నిదర్శనంగా నిలుస్తోంది.

# ఖమ్మం కార్పొరేషన్ నిర్లక్ష్యం..

## నరకప్రాయంగా రోటరీ నగర్ వాసుల జీవనం..



**ఖమ్మం,(ప్రజావినికిడి):**
ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 9వ వార్డు,రోటరీ నగర్ (ఇంటి నెం. 15-6-64/5 సమీపంలో) ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారుడ్రైనేజీ నిర్మాణం పేరుతో నెలల క్రితం తవ్విన గోతులు పూడ్చకపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు

**.స్తంభించిన నిత్యావసర సేవలు:**
రోడ్డు మధ్యలో అడ్డదిడ్డంగా తవ్వి వదిలేయడం వల్ల అటువైపు కనీసం నడవడానికి కూడా వీలు లేకుండా పోయింది. దీనివల్ల:గ్యాస్ సరఫరా నిలిచిపోయింది: గ్యాస్ సిలిండర్ వాహనాలు రాకపోవడంతో మహిళలు సిలిండర్లను మోసుకెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది.
మున్సిపల్ చెత్త వాహనాల రాక బంద్:చెత్త బండ్లు రాకపోవడంతో వీధుల్లో చెత్త పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది.అత్యవసర సరఫరాలు కట్: డెలివరీ వాహనాలు కానీ, అత్యవసర వైద్య సేవలు కానీ ఇక్కడికి చేరలేకపోతున్నాయి.
**మండే ఎండలు - ముంచుకొస్తున్న రోగాలు:** ఒకవైపు ఎండలు మండిపోతుంటే, మరోవైపు తెరిచి ఉంచిన డ్రైనేజీ గుంతల వల్ల దోమలు విపరీతంగా పెరిగిపోయాయి.డ్రైనేజీ తవ్వి నెలలు గడుస్తున్నా పట్టించుకునే నాథుడే లేడు. మురికి నీరు నిలిచిపోయి అంటువ్యాధులు ప్రబలే ప్రమాదం ఉంది.

# సన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూరాలజీ
# వైద్య సంస్థ ప్రారంభోత్సవం





**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):**
కొత్తపేట డివిజన్ పరిధిలోని ఆర్టీసీ కాలనీలో నూతనంగా ప్రారంభమైన సన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూరాలజీ వైద్య సంస్థ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రపంచ స్థాయి యూరాలజీ మరియు నెఫ్రాలజీ వైద్య సేవలను అందించాలనే లక్ష్యంతో ఈ సంస్థను ప్రారంభించడం అభినందనీయమని తెలిపారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి రావడం ఎంతో సంతోషకరమని పేర్కొన్నారు.ప్రత్యేకంగా యూరాలజీ,కిడ్నీ సంబంధిత చికిత్సలు ఒకే వేదికపై ఆధునిక సదుపాయాలతో అందించబడటం ఈ ప్రాంత ప్రజలకు ఎంతో ఉపయోగకరమని అన్నారు. వైద్యరంగంలో ఇటువంటి ప్రత్యేక సంస్థలు పెరగడం సమాజ ఆరోగ్యాభివృద్ధికి దోహదపడుతుందని వెల్లడించారు.
ఈ సందర్భంగా సంస్థ నిర్వాహకులు సూర్య ప్రకాష్ వైద్య బృందాన్ని సుధీర్ రెడ్డి గారు అభినందించారు.
ఈ కార్యక్రమంలో స్థానిక ప్రముఖులు, భారస నాయకులు మహేష్ రెడ్డి మరియు ఇతర నాయకులు, హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

# శభాష్ ...!
# నాగోల్ పోలీసులు..

## విద్యార్థిని భవిష్యత్తును కాపాడిన నాగోల్ పోలీసులు..
## సమయస్ఫూర్తిని నిమిషాల వ్యవధిలోనే విద్యార్థిని గమ్యానికి చేర్చిన నాగోల్ పోలీసులు

**నాగోల్,(ప్రజావినికిడి):**
పరీక్షల సమయంలో ఒక్క నిమిషం కూడా ఎంత కీలకమో అందరికీ తెలిసిందే. అలాంటి కీలక సమయంలో సమయస్ఫూర్తితో స్పందించి ఒక విద్యార్థిని భవిష్యత్తును కాపాడిన ఘటన నాగోల్‌లో చోటుచేసుకుంది. ఈ ఘటనలో పోలీసులు చూపిన చాకచక్యం, సమన్వయం ప్రత్యేకంగా నిలిచింది.
కర్మన్‌ఘాట్ బైరామలగూడలోని అడ్వాన్స్ బ్లాక్ బోర్డుఅకాడమీ కోచింగ్ సెంటర్‌లో నీట్ లాంగ్‌టర్మ్ కోచింగ్ తీసుకుంటున్న ఎస్.నందిని, కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేసిన వాహనంలో వెళ్లాల్సింది పోయి పొరపాటున ఎల్బీనగర్ రూట్ వాహనంలో ఎక్కి నాగోల్‌లోని జెడ్ పి హెచ్ ఎస్
పరీక్ష కేంద్రం వద్ద దిగింది.అయితే కొద్ది సేపటికే అది తాను రాయాల్సిన అసలు కేంద్రం కాదని గుర్తించి తీవ్ర ఆందోళనకు గురైంది.
ఆ సమయంలో అక్కడ విధుల్లో ఉన్న నాగోల్ పోలీస్ ఇన్స్పెక్టర్ ఆమె పరిస్థితిని గమనించి వెంటనే స్పందించారు. విద్యార్థినికి ధైర్యం చెప్పడంతో పాటు, వనస్థలిపురం ఇన్స్పెక్టర్‌తో సమన్వయం చేసి అసలు పరీక్ష కేంద్రానికి చేరుకునేలా అత్యవసర ఏర్పాట్లు చేశారు. పోలీస్ వాహనాన్ని వినియోగిస్తూ వేగంగా తరలించి, మధ్యాహ్నం 1:15 గంటలలోపు



వనస్థలిపురం రైతు బజార్ సమీపంలోని జెడ్ పి హెచ్ ఎస్ స్కూల్ కాంప్లెక్స్‌లో ఉన్న అసలు పరీక్ష కేంద్రానికి సురక్షితంగా చేర్చారు.
పరీక్ష కేంద్రానికి సమయానికి చేరుకోలేనేమో అన్న భయంతో ఉన్న నందినికి ఇది పెద్ద ఊరటనిచ్చింది. సంవత్సరం పాటు చేసిన కృషి వృథా కాకుండా పోలీసుల తక్షణ చర్యల వల్ల ఆమె పరీక్ష రాయగలిగింది.
ఈ ఘటనపై స్పందించిన కాలేజీ చైర్మన్ మూర్తి, ప్రిన్సిపాల్ రమ, విద్యార్థినీ తండ్రి నీలియా నాయక్ నాగోల్ పోలీసులకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.
స్థానికులు కూడా పోలీసుల సమయస్ఫూర్తి, బాధ్యతాయుత వైఖరిని ప్రశంసిస్తూ, ప్రజలతో పోలీసుల అనుబంధం ఇలాంటివి మరింత బలపరుస్తాయని అభిప్రాయపడుతున్నారు.

# సేవ చేసే వాళ్ళు నిజమైన హీరోలు

## మాజీ గవర్నర్ దత్తాత్రేయ




**హిమాయత్ నగర్,(ప్రజావినికిడి ):**
సమాజానికి సేవ చేసే వ్యక్తులే నిజమైన హీరోలు అని మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. హైదరాబాద్ నారాయణ గూడలోని కేశవ్‌రావ్ మెమోరియల్ లో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో 'అన్ సంగ్ హీరోస్' అవార్డులు ప్రదానోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ గవర్నర్ విచ్చేసి మాట్లాడారు.శ్రీశ్రీ రవిశంకర్ గురుదేవ్ ఆధ్వర్యంలో దిల్లీలో జరిగిన ప్రపంచ సాంస్కృతిక ఉత్సవాల నిర్వహణ సందర్భంగా,ఆర్ట్ ఆఫ్ లివింగ్ కార్యకర్తలు యమునా నదిని స్వచ్ఛంగా తీర్చిదిద్దిన వైనాన్ని గుర్తు చేశారు.ప్రపంచ వ్యాప్తంగా సంఘర్షణల నివారణకు శ్రీశ్రీ చేసిన కృషిని ప్రస్తావిస్తూ అయోధ్య వివాద పరిష్కారం,కరోనా సమయంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ చేసిన సేవలను కొనియాడారు. తెలంగాణా వ్యాప్తంగా వివిధ రంగాలలో సేవ చేసిన వారిని అభినందించారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ సీనియర్ టీచర్ రవి మాట్లాడుతూ, స్వప్రయోజనాలకు అతీతంగా సమాజానికి సేవచేస్తున్న వారిని సత్కరించుకోవటం సంస్థకు, సమాజానికి గౌరవమని పేర్కొన్నారు.45 ఏండ్లుగా ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ వివిధ రంగాలలో చేపట్టిన కార్యక్రమాలను ప్రస్తావించారు. మనం చేసే సేవా పనిలోనే నిజమైన ఫలితం ఉంటుందని గురుదేవ్ శ్రీశ్రీ రవిశంకర్ మాటలను తెలిపారు.ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ 45వ వార్షికోత్సవాలు, విశ్వ విఖ్యాత మానవతావాది, ఆధ్యాత్మికవేత్త గురుదేవ్ శ్రీశ్రీ రవిశంకర్ 70 సంవత్సరాల నిరంతర సేవ సందర్భంగా ఆర్ట్ ఆఫ్ లివింగ్ సంస్థ "అన్ సంగ్ ఎవ్విరిడే హీరోస్" పేరిట ఓ కార్యక్రమానికి దేశ వ్యాప్తంగా శ్రీకారం చుట్టింది. సమాజానికి స్ఫూర్తివంతమైన సేవలను నిస్వార్థంగా అందిస్తున్న వ్యక్తులను రాష్ట్రంలోని 19 మందిని గుర్తించి వారిని శాలువాతో సత్కరించారు.ఈ కార్యక్రమంలో అపెక్స్ సభ్యులు రవి,ఆనంద్, భరద్వాజ, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

# మైక్రో ఫైనాన్స్ కేసులో హేమకాంత్ అరెస్టు

## ఇప్పటికే ముగిసిన నిందితుడు మధు పోలీస్ కస్టడీ
## తదుపరి విచారణలో మంగ్లీ, సోదరుడు శివ పాత్రపై ఆరా తీయనున్న పోలీసులు

మైక్రో ఫైనాన్స్ కేసులో నిందితుడిగా ఉన్న హేమకాంత రెడ్డిని సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. మైక్రో ఫైనాన్స్ కేసులో ఇదివరకే రమావత్ మధును సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. కస్టడీకి తీసుకొని పోలీసులు మూడు రోజులు విచారించారు, కస్టడీ ముగియడంతో శనివారం మధును జైలుకు పంపించారు. ఈ క్రమంలోనే హేమకాంతరెడ్డిని అరెస్టు చేశారు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చి, కస్టడీకి తీసుకోనున్నట్లు తెలిసింది. మధు, హేమకాంతరెడ్డి ఇద్దరిని విచారిస్తే మైక్రో ఫైనాన్స్ కేసులోని అసలు విషయాలు బయటికి వస్తాయని పోలీసులు భావిస్తున్నారు.



# మహిళా కానిస్టేబుల్‌ను అవమానించిన
# నాగరాజుపై షాద్‌నగర్ పోలీసుల యాక్షన్..

## రాజకీయ అండ చూసుకుని విర్రవీగితే చట్టం తన పని తాను చేసుకుపోతుంది.
## విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుల్‌ను అవమానిస్తే సహించేది లేదు: షాద్‌నగర్ పోలీసుల హెచ్చరిక..

**షాద్‌నగర్,(ప్రజావినికిడి):**
విధి నిర్వహణలో ఉన్న ఒక మహిళా ట్రాఫిక్ పోలీస్ కానిస్టేబుల్‌తో దురుసుగా ప్రవర్తించి,ఆమెను అవమానపరిచిన నాగరాజు అనే వ్యక్తిపై షాద్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. నిబంధనలు పాటించమని కోరినందుకు ఒక ప్రభుత్వ ఉద్యోగి అని కూడా చూడకుండా అహంకారంతో వ్యవహరించిన సదరు వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు పోలీసులు తెలిపారు.

**ఘటన వివరాలు:**
షాద్‌నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో గత నాలుగేళ్లుగా విధులు నిర్వహిస్తున్న తిరుపతమ్మ అనే కానిస్టేబుల్, ఆదివారం రోజు మధ్యాహ్నం 1:30 గంటల సమయంలో చటాన్‌పల్లి రైల్వే గేట్ వద్ద ట్రాఫిక్ క్లియర్ చేస్తున్నారు.
ఆ సమయంలో దూసుకల్ వైపు నుండి ఒక కారు అత్యంత నిర్లక్ష్యంగా రాంగ్ రూట్‌లో దూసుకువచ్చింది. ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ఉండాలని ఆమె ఆ



కారును ఆపి, సరైన మార్గంలో వెళ్లాలని సూచించారు.

**అవమానకరంగా ప్రవర్తన:**
కానిస్టేబుల్ సూచనతో ఆగ్రహానికి గురైన కారులోని వ్యక్తి నాగరాజు, "నేనెవరో తెలుసా?నన్ను ఆపుతావా?" అంటూ ఆమెతో గొడవకు దిగాడు.అంతేకాకుండా,విధి నిర్వహణలో ఉన్న మహిళా అధికారిని "లేబర్‌లా ఎందుకు అరుస్తున్నావు?"అంటూ అత్యంత అవమానకరమైన పదజాలంతో దూషించి,జులుం ప్రదర్శించాడు. తన రాజకీయ పలుకుబడిని చూపిస్తూ ఆమెను బెదిరించే ప్రయత్నం చేశాడు.

**నాగరాజు పై కేసు నమోదు**
బాధితురాలు తిరుపతమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు షాద్‌నగర్ పోలీసులు నాగరాజుపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించడం,మహిళా కానిస్టేబుల్ పట్ల అసభ్యంగా ప్రవర్తించడం వంటి సెక్షన్ల కింద చర్యలు తీసుకోనున్నారు.చట్టం ముందు అందరూ సమానమేనని, అండదండలు ఉన్నాయని అతిక్రమిస్తే ఊరుకునేది లేదని పట్టణ సీఐ ఈ సందర్భంగా హెచ్చరించారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



## ఉప్పల్ ప్రెస్ క్లబ్ ప్రింట్ & ఎలక్ట్రానిక్ మీడియా ఆధ్వర్యంలో

# ఘనంగా ప్రపంచ పత్రికా స్వేచ్ఛా దినోత్సవం..

**ముఖ్య అతిథులుగా హాజరై జర్నలిస్టులను సన్మానించిన బిఆర్ఎస్ నాయకులు నేర్దం భాస్కర్ గౌడ్..జల్లి మోహన్..**





**ఉప్పల్,(ప్రజావినికిడి):** హైదరాబాద్ ఉప్పల్ ప్రెస్ క్లబ్ ( ప్రింట్& ఎలక్ట్రానిక్ ) ఆధ్వర్యంలో ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. చిలుకానగర్‌లోని నోవా బాంకెట్ హాల్‌లో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వడ్డెపల్లి కిషోర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి బీఆర్ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి, మలిదశ తెలంగాణ ఉద్యమకారుడు, ఉప్పల్ నియోజకవర్గ బీసీ జేఏసీ నాయకులు నేర్దం భాస్కర్‌గౌడ్, చిల్కానగర్ సీనియర్ బిఆర్ఎస్ నాయకులు జల్లి మోహన్ లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానికంగా పలు రంగాల్లో విశేష కృషి చేసిన జర్నలిస్టులను ఘనంగా సన్మానించి మెమొంటో డైరీలను అందజేసి వారికి ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,
ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ ప్రజాస్వామ్య వ్యవస్థలో మీడియా పాత్ర అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తుందని అన్నారు. నిజాలను వెలికితీసి ప్రజలకు చేరవేయడంలో జర్నలిస్టులు అహరహం కృషి చేస్తున్నారని వారి సేవలు సమాజానికి ఎంతో విలువైనవంటూ అభినందించారు. నిరంతరం ప్రజలలో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేసే మీడియా ప్రతినిధుల సమస్యలను కూడా ప్రభుత్వం పట్టించుకోవాలనీ, వారి కనీస మౌళిక సదుపాయాల రూపకల్పన కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రపంచ పత్రికా స్వేచ్ఛ దినోత్సవం సందర్భంగా మీడియా స్వేచ్ఛను కాపాడాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. సీనియర్ పాత్రికేయులు తమ అనుభవాలను పంచుకుంటూ, యువ జర్నలిస్టులు నిజాయితీతో, బాధ్యతతో పనిచేయాలని దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఆనంద నర్సింహారెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ లు పయ్యావుల సంతోష్,కీర్తి సంతోష్,జిఎస్ సీసా నాగరాజులతోపాటు క్లబ్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కెటిఆర్ సాయం.. బ్రెయిన్ ట్యూమర్ జయించిన బాలిక



హైదరాబాద్ **మే 3,(ప్రజావినికిడి)::** ఆరేళ్ల క్రితం ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఒక చిన్నారికి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ అందించిన సాయం, నేడు ఆ బాలిక జీవితంలో కొత్త వెలుగులు నింపింది. కెటిఆర్ సాయంతో బ్రెయిన్ ట్యూమర్ జయించిన బాలిక ఇటీవల విడుదలైన పదో తరగతిలో ఉత్తీర్ణత సాధించారు. 2019లో ప్యారడైజ్ బాలంరాయ్‌కు చెందిన కె. నారాయణ, రాజేశ్వరి దంపతుల కుమార్తె శరణ్య బ్రెయిన్ ట్యూమర్ బారిన పడగా, ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స కోసం దాదాపు రూ. 20 లక్షలు ఖర్చవుతుందని వైద్యులు చెప్పడంతో ఆ పేద కుటుంబం దిక్కుతోచని స్థితిలో పడిపోయింది. ఆరోగ్యశ్రీలో చిన్నారి పేరు లేకపోవడంతో బసవతారకం ఆసుపత్రిలో అడ్మిషన్ దొరకక వారు వారం రోజుల పాటు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఈ క్లిష్ట సమయంలో శరణ్య చిన్నమ్మ పూజిత, ఎక్స్ (ట్విట్టర్) వేదికగా కెటిఆర్‌కు విజ్ఞప్తి చేశారు. దీనిపై ఆయన వెంటనే స్పందించి, తన బృందాన్ని రంగంలోకి దింపారు. ట్వీట్ చేసిన అరగంటలోనే రిప్లై రావడమే కాకుండా, మరుసటి రోజు ఆదివారం (సెలవు దినం) అయినప్పటికీ, కెటిఆర్ ఆదేశాలతో కలెక్టర్ కార్యాలయ సిబ్బంది ఆసుపత్రికి చేరుకుని అడ్మిషన్ ప్రక్రియను పూర్తి చేశారు. కెటిఆర్ చొరవతో శరణ్యకు అత్యంత ఖరీదైన వైద్యం పూర్తి ఉచితంగా చికిత్స లభించింది. చిన్నారి శరణ్యకు స్టంట్ వేయడంతో పాటు మేజర్ సర్జరీ నిర్వహించారు.

# రంగారెడ్డి జిల్లాలోని ప్రైవేటు పాఠశాలల పై ప్రభుత్వ విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యమా

**లేదా ప్రైవేటు పాఠశాలలతో ఒప్పందమా**

**హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఫర్ ఇండియా రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఆయిల్ శ్రీశైలం గౌడ్**




**షాద్ నగర్,(ప్రజావినికిడి),** రంగారెడ్డి జిల్లాలోని వివిధ మండల కేంద్రాలలో నిర్వహిస్తున్న ప్రైవేటు పాఠశాలలపై స్పందిస్తూ ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను ఉల్లంఘించి తప్పుడు అనుమతులతో పాఠశాలలను నిర్వహిస్తున్న పట్టించుకోని విద్యాశాఖ అధికారులు అంటూ ప్రైవేటు పాఠశాలల తనిఖీలపై విద్యాశాఖ అధికారులు జాప్యం నిర్వహిస్తున్నారని దాదాపు గత 20 సంవత్సరాల నుండి ఇప్పటివరకు యదేచ్ఛగా పాఠశాలలను నిర్వహిస్తూఅధిక ఫీజులతో విద్యార్థులను మానసిక వేధింపులకు గురి చేస్తున్న యాజమాన్యం పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి అదేవిధంగా విద్య ప్రాథమిక హక్కుగా (ఆర్టికల్ 21ఏ) భారత రాజ్యాంగంలోని 86వ సవరణ (2002) ద్వారా ఆర్టికల్ 21-ఏ ప్రకారం విద్యను ప్రాథమిక హక్కుగా మార్చారు కాబట్టి ప్రైవేట్ పాఠశాలల్లో మరియు అన్‌ఎయిడెడ్ పాఠశాలలో కూడా 25% సీట్లను బలహీనవర్గాలకు మరియు ఆర్థికంగా వెనుకబడిన (ఈ డబ్ల్యూ ఎస్) పిల్లలకు ఉచితంగా అందించే విధంగా విద్య హక్కు చట్ట సవరణలు చేయడం జరిగింది ఈ చట్ట సవరణలను అమలు చేసే విధంగా నిర్ణయాలు ఉండాలి. కానీ ప్రభుత్వ విద్యాశాఖ అధికారులు ఈ ప్రైవేటు విద్యా పాఠశాలల పైన తనిఖీలు చేయకపోగా రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఆయా మండలాలలో ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలైన అనుమతి పత్రాలు లేకున్నా తప్పుడు అనుమతి పత్రాలతో ప్రైవేటు పాఠశాలలకు విద్యాశాఖ అధికారులు ఇష్టానుసారంగా పాఠశాల ప్రారంభాలకు పర్మిషన్లు ఇవ్వడం జరిగిందని అసహనం వ్యక్తం చేస్తూ ఇప్పటికైనా ప్రైవేటు పాఠశాలల పై తనిఖీలు నిర్వహించి ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను అమలు జరిగే విధంగా కఠినమైన చర్యలు తీసుకోవాలని లేనియెడల పాఠశాలల గుర్తింపును రద్దు చేయాలని కోరుతున్నాము అని అన్నారు.

# హైదరాబాదులో డ్రంక్ అండ్ డ్రైవ్...

## 700 మందికి పైగా దొరికారు!



హైదరాబాద్,**మే 3,(ప్రజావినికిడి):** సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ల పరిధిలో వారాంతంలో నిర్వహించిన స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో భారీ సంఖ్యలో మందుబాబులు పట్టుబడ్డారు. రెండు కమిషనరేట్లలో కలిపి మొత్తం 728 మంది మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పోలీసులకు చిక్కారు. హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు మే 1, 2 తేదీల్లో నిర్వహించిన తనిఖీల్లో 445 మందిని పట్టుకున్నారు. వీరిలో 371 మంది ద్విచక్ర వాహనదారులు, 26 మంది త్రీవీలర్ వాహనదారులు, 48 మంది కార్లు, ఇతర వాహనాల డ్రైవర్లు ఉన్నారు. పట్టుబడిన వారి బ్లడ్ ఆల్కహాల్ కంటెంట్ (బీఏసీ) స్థాయిల ఆధారంగా కేసులు నమోదు చేసినట్లు జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్) తెలిపారు. మరోవైపు, సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన స్పెషల్ డ్రైవ్‌లో 283 మంది పట్టుబడ్డారు. వీరిలో 227 మంది టూ-వీలర్ డ్రైవర్లు, 39 మంది కార్ డ్రైవర్లు, 9 మంది త్రీ-వీలర్, 8 మంది భారీ వాహన డ్రైవర్లు ఉన్నారు. పట్టుబడిన వారందరినీ కోర్టులో హాజరుపరుస్తామని అడిషనల్ కమిషనర్ ఆఫ్ పోలీస్ జి. హనుమంతరావు తెలిపారు.
ఈ సందర్భంగా పోలీసులు కీలక హెచ్చరికలు జారీ చేశారు. మద్యం సేవించి వాహనం నడిపి ప్రాణాంతక ప్రమాదాలకు కారణమైతే, భారతీయ న్యాయ సంహిత, 2023లోని సెక్షన్ 105 కింద కేసు నమోదు చేస్తామని సైబరాబాద్ పోలీసులు స్పష్టం చేశారు. ఈ సెక్షన్ ప్రకారం గరిష్టంగా 10 సంవత్సరాల జైలు శిక్ష, జరిమానా విధించే అవకాశం ఉందని హెచ్చరించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ విషయంలో జీరో టాలరెన్స్ విధానాన్ని పాటిస్తామని, ఈ స్పెషల్ డ్రైవ్‌లు కొనసాగుతాయని పోలీసులు తెలిపారు.

# 14 లక్షల విద్యార్థులకు సిఎం వెన్నుపోటు

**ఫీజు రీయింబర్స్‌మెంట్ రద్దుకు ముఖ్యమంత్రి కుట్ర -జీఓ నెంబర్ 7 పేరిట చీకటి ఉత్తర్వులు వెంటనే వెనక్కి తీసుకుని విద్యార్థులకు క్షమాపణ చెప్పాలి**

**- లేకపోతే మీరు, మంత్రులు రోడ్లపై తిరగలేరు సిఎం రేవంత్‌రెడ్డికి బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ లేఖ**

**హైదరాబాద్: మే 3,(ప్రజావినికిడి):** రాష్ట్రంలో 14 లక్షల మం ది విద్యార్థులకు సిఎం రేవంత్ రెడ్డి వెన్నుపోటు పొడిచాడని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను రద్దు చేసేందుకే చీకటి జిఒ 7 ను తీసుకొచ్చారని మండిపడ్డారు. విద్యాశాఖను విధ్వం సం చేసేందుకే నీ దగ్గర పెట్టుకున్నావా అని నిలదీశారు. దుర్మార్గమైన జిఒ 7ను వెంటనే వెనక్కి తీసుకుని క్షమాప ణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థుల తో కలిసి రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సిఎం, మంత్రులు రోడ్లపై తిరగలేరని హెచ్చరిస్తూ ఆదివారం సిఎం రేవంత్ రెడ్డికి కెటిఆర్ ఘాటు లేఖ రాశా రు. రాష్ట్రంలోని 14 లక్షల మంది బిసి, ఎస్‌సి,ఎస్‌టి, మై నారిటీ విద్యార్థులకు కొండంత అండగా నిలిచే ఫీజు రీ యింబర్స్‌మెంట్ పథకాన్ని రద్దుచేసేలా చేస్తున్న కుట్ర భ యంకరమైనదని పేర్కొన్నారు. ఈ జిఒ వచ్చిన క్షణం నుం చి విద్యార్థులకే కాదు, లక్షలాది మంది నిరుపేద తల్లిదండ్రులకు కూడా కంటి మీద కునుకు కరువైందని అన్నారు. ఇప్పటికే గురుకుల వ్యవస్థను పూర్తిగా కుప్పకూల్చడంతో 142 మందికి పైగా చందమామల్లాంటి పిల్లలు తనువు చా లించారని, కనీసం సరైన భోజనం కూడా కల్పించలేని చే తకాని సర్కారు వల్ల ఇప్పటికీ వేలాది మంది విద్యార్థులు ఆసుపత్రుల పాలవుతూనే ఉన్నారని అన్నారు. ఉమ్మడి రా ష్ట్రంలో కాంగ్రెస్ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి మం చి ఉద్దేశంతో ప్రవేశపెట్టిన ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని రాజకీయాలకు అతీతంగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ కూడా కొనసాగించారని గుర్తు చేశారు. విజిలెన్స్ దాడుల పేరిట కళాశాలలకు బెదిరింపులు రాష్ట్రవ్యాప్తంగా 2500కు పైగా నడుస్తున్న ఉన్నత విద్యాసంస్థలకు ఫీజు రీయింబర్స్‌మెంట్



బకాయిలు ఒక్క పైసా చెల్లించకుండా రెండున్నరేళ్లుగా తీవ్ర వేధింపులకు గుర్తి చే శారని మండిపడ్డారు. బాకీల చెల్లింపు విషయంలో వన్ టై మ్ సెటిల్‌మెంట్ పేరిట కొంతకాలం, ట్రస్ట్, టోకెన్ల పేరిట ఇంకొంత కాలం కమిటీల పేరిట మరికొన్ని రోజులు మ భ్యపెట్టారని అన్నారు. చివరికి అసలుకే ఎసరు తెచ్చిన కాంగ్రెస్ దివాళాకోరు విధానాన్ని చూసి విద్యార్థి లోకం తీ వ్రంగా అసహ్యించుకుంటోందని విమర్శించారు. పెద్దఎత్తున బకాయిలు పేరుకుపోవడంవల్ల కళాశాలలు నడపలే క యాజమాన్యాలు బంద్ పాటిస్తే, ప్రభుత్వ చేతకానితనా న్ని కప్పిపుచ్చుకునేందుకు విజిలెన్స్ దాడుల పేరిట కళాశాలలపై బెదిరింపులకు పాల్పడ్డారని ఆగ్రహం వ్యక్తం చేశా రు. చివరికి 1207 కోట్ల విడుదల పేరిట ఇచ్చిన టోకెన్లకు నేటికీ దిక్కులేకుండా పోయిందని పేర్కొన్నారు. గత 30 నెలల్లో మూడు పైసలు కూడా విడుదల చేయని కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు విద్యార్థుల ఖాతాలో నేరుగా ఫీజులు జమవేస్తామంటే ఎవరు నమ్ముతారు..? అని ప్రశ్నించారు.
పేద విద్యార్థులతో కలిసి సమరశంఖం పూరిస్తాం ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టేలా తెచ్చిన చీకటి జీఓను వెన క్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. అప్పటివరకు సిఎం రేవంత్‌రెడ్డిని, ఆయన ప్రభుత్వాన్ని బిఆర్ఎస్ పార్టీ వదిలి పెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర ఆందోళనలో ఉన్న 14 లక్షల మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ పేద విద్యార్థులతో దండుకట్టి కాంగ్రెస్ సర్కారుపై సమరశంఖం పూరిస్తామని వెల్లడించారు. ఇప్పటికే అన్నదాతల ఆందోళనలతో అట్టుడుకుతున్న రాష్ట్రంలో దగాపడ్డ విద్యార్థులు గర్జిస్తే మీరు, మంత్రులు రోడ్లపై తిరగలేరని సిఎం రేవంత్‌రెడ్డిని ఉద్దేశిస్తూ వ్యాఖ్యానించారు.

# అంతర్జాతీయ శ్రామిక పోరాట దినోత్సవం

ఘనంగా మేడే జెండా ఆవిష్కరణలు - లేబర్ కోడ్ల రద్దయ్యే వరకు పోరాడాలి

జిల్లా ప్రధాన కార్యదర్శి బి సురేష్ కార్మికులకు పిలుపు





**అనంతపురం మే 3,(ప్రజావినికిడి):**
అనంతపురం జిల్లా గుంతకల్లు పట్టణంలో ఆదివారం భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్టియు) ఆధ్వర్యంలో రామిరెడ్డి కాలనీ , ఉమామహేశ్వర నగర్ , భగత్ సింగ్ కాలనీ , ఆర్టీసీ బస్టాండ్ దగ్గర ఆటో స్టాండ్ , కసాపురం రోడ్ ఆటో స్టాండ్ లో మే డే జెండాను ఘనంగా ఆవిష్కరించారు.

**ప్రపంచవ్యాప్తంగా ఎనిమిది గంటల పని విధానం అమలు**

ఈ సందర్భంగా ఐ ఎఫ్ టి యు జిల్లా ప్రధాన కార్యదర్శి బి సురేష్ మాట్లాడుతూ అంతర్జాతీయ శ్రామిక పోరాట దినోత్సవం మేడే జెండాల ఆవిష్కరణ మే 1 నుండి మే 5 వరకు ప్రతి సంవత్సరం నిర్వహించుకోవడం జరుగుతున్నదని అమెరికాలోని చికాగో నగరంలో 140 సంవత్సరాల క్రితం అక్కడి పెట్టుబడిదారులకు ప్రభుత్వానికి వ్యతిరేకంగా కార్మికులు ఎనిమిది గంటల పని దినం కోసం రోడ్ల మీదకు వచ్చి సమ్మె చేయడం జరిగింది . కార్మికుల ఆందోళన కార్యక్రమాన్ని ప్రభుత్వం పోలీసులు ద్వారా అణిచివేయాలని ప్రయత్నించడంతో పోలీసులు కాల్పులు జరపడంతో 4 కార్మికులు మరణించడం అనేకమందికి రక్త గాయాలు కావడం ఈ ఆందోళన కార్యక్రమానికి నాయకత్వం వహించిన కార్మిక నాయకులను ఆరు మందిని ఉరి తీయడం జరిగిందన్నారు. వారి త్యాగాల ఫలితంగానే ప్రపంచవ్యాప్తంగా ఎనిమిది గంటల పని విధానం అమలు కావడం జరిగిందన్నారు.

**బహుళ జాతి కంపెనీలకు అనుకూలంగా లేబర్ కోడ్లు**

బ్రిటిష్ ప్రభుత్వములోను తర్వాత అనేక పోరాటాల ద్వారా 29 కార్మిక చట్టాలను హక్కులను సౌకర్యాలను కార్మికులు సాధించారు. అయితే నరేంద్ర మోడీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దుపరిచి నాలుగు లేబర్ కోడ్లను కార్పొరేట్ కంపెనీలకు పెట్టుబడిదారులకు బహుళ జాతి కంపెనీలకు అనుకూలంగా లేబర్ కోడ్లను తీసుకురావడం అత్యంత బాధాకరమన్నారు. దీనివలన కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులన్నీ నిర్వీర్యం కావడం , లేబర్ కోడ్ల వలన కార్మికులు కట్టు బానిసలుగా యాజమాన్యాల మీద ఆధారపడి బతకవలసిన పరిస్థితి రావడం జరుగుతోందన్నారు. సమ్మె చేసే హక్కు యూనియన్ ఏర్పాటు చేసుకునే హక్కు పీఎఫ్ ఈఎస్ఐ గ్రాట్యుటీ , ఇన్సూరెన్స్ , ఎక్స్ గ్రేషియా తదితర సౌకర్యాలు అన్ని యాజమాన్యాల మీద ఆధారపడి ఉంటాయి వీటిని చట్ట ప్రకారం పొందాలంటే సివిల్ కోర్టులకు వెళ్లే పరిస్థితి ఉండదు . అందువల్లనే కార్మికులు అనేక సంవత్సరాలుగా లేబర్ కోడ్లకు వ్యతిరేకంగా ఆందోళన , నిరసన , సమ్మె కార్యక్రమాలు నిర్వహిస్తూ ముక్తకంఠంతో వ్యతిరేకించడం జరుగుతుందన్నారు. చంద్రబాబు నాయుడు కూటమి ప్రభుత్వం కూడా మోడీ కార్మిక వ్యతిరేక విధానాలను అమలు పరచడానికి అతి ఉత్సాహాన్ని ప్రదర్శిస్తూ ఎనిమిది గంటల పని విధానాన్ని 12 గంటల పని విధానాన్ని మారుస్తూ జీవో ఇచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను , నాలుగు లేబర్ కోడ్లను రద్దు పరిచేంతవరకు ఆందోళన కార్యక్రమాలను కార్మిక వర్గం నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అరుణోదయ సంస్కృతిక సమాఖ్య జిల్లా నాయకులు చంద్రప్ప , ఐ ఎఫ్ టి యు జిల్లా కమిటీ సభ్యులు దావీదు రాజశేఖర్ శెట్టి రఘునాథ్ రెడ్డి రాందాస్ పిఓడబ్ల్యూ నియోజకవర్గ కార్యదర్శి ఆశాబీ మాబూనీ, పి డి ఎస్ యు నియోజవర్గం కార్యదర్శి వినోద్ భరత్ సాయి తదితరులు మాట్లాడడం జరిగినది. ఐ ఎఫ్ టి యు కమిటీ సభ్యులు షేక్షావలి భాష గోపి కృష్ణ ఈశ్వరయ్య దాదు బి హేమలత తదితరులు పాల్గొన్నారు.

## బాబోయ్ 46.2 డిగ్రీలు...

# గూడూరులో భానుడి విశ్వరూపం



ఆంధ్రప్రదేశ్‌లో వాతావరణం విచిత్రంగా మారింది. ఒకవైపు భానుడు తన విశ్వరూపం చూపిస్తుంటే, మరోవైపు అక్కడక్కడా వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం నాడు నెల్లూరు జిల్లా గూడూరులో అత్యధికంగా 46.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. ఎండ తీవ్రతకు ప్రజలు అల్లాడిపోయారు. ఈ సీజన్ లో ఇప్పటివరకు ఇదే రికార్డు. ఇదే సమయంలో ప్రకాశం జిల్లా కొప్పెరపాడులో కూడా 46.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

ఇందుకు పూర్తి భిన్నంగా, రాష్ట్రంలోని మరికొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిశాయి. ముమ్మిడివరంలో అత్యధికంగా 72.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, కాట్రేనికోనలో 57.7 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. దీంతో ఒకే రాష్ట్రంలో ఎండ తీవ్రత, భారీ వర్షాలు అనే రెండు భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. సోమవారం (మే 4) కూడా ఇదే తరహా వాతావరణం కొనసాగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. విజయనగరం, మన్యం, పోలవరం, ఏలూరు, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, నెల్లూరు జిల్లాల్లోని 27 మండలాల్లో వడగాలులు వీచే ప్రమాదం ఉందని హెచ్చరించారు. మరోవైపు కాకినాడ, అనకాపల్లి, కోనసీమ, ఉత్తరాంధ్రతో పాటు చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడొచ్చని అంచనా వేశారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వర్షం సమయంలో రైతులు, పశువుల కాపరులు చెట్ల కిందకు వెళ్లవద్దని అధికారులు సూచించారు.

# మధ్యప్రదేశ్ ప్రమాదంతో అప్రమత్తం..

## తెలంగాణలో బోటింగ్‌పై కఠిన నిబంధనలు




మధ్యప్రదేశ్‌లోని బార్గి రిజర్వాయర్‌లో ఇటీవల జరిగిన ఘోర పడవ ప్రమాదం నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. పర్యాటకుల భద్రతకు అధిక ప్రాధాన్యమిస్తూ రాష్ట్రంలోని అన్ని బోటింగ్ కేంద్రాల్లో కఠినమైన భద్రతా చర్యలను అమలు చేయాలని తెలంగాణ పర్యాటక అభివృద్ధి సంస్థ నిర్ణయించింది. ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది.

రాష్ట్రంలో పర్యాటకుల రద్దీ పెరుగుతున్నందున, బోటింగ్ కేంద్రాల్లో భద్రతా ప్రమాణాలను కచ్చితంగా పాటించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇకపై ఏ చిన్న పొరపాటు జరిగినా సంబంధిత యూనిట్ మేనేజర్లు, ఇన్‌ఛార్జ్‌లే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించింది. వారాంతాలు, సెలవు దినాలు, పర్యాటకుల రద్దీ ఎక్కువగా ఉండే సమయాల్లో అధికారులు తప్పనిసరిగా బోటింగ్ యూనిట్ల వద్ద భౌతికంగా హాజరు కావాలని ఆదేశించింది.

బోట్లలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించడం (ఓవర్ లోడింగ్), ప్రయాణికులకు లైఫ్ జాకెట్లు అందించకపోవడం వంటి ఉల్లంఘనలను ఏమాత్రం సహించేది లేదని ప్రభుత్వం తేల్చిచెప్పింది. నిబంధనలు అతిక్రమించిన వారిపై సస్పెన్షన్‌తో సహా కఠిన క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ప్రతికూల వాతావరణ పరిస్థితులు నెలకొన్నప్పుడు బోటింగ్ సర్వీసులను తక్షణమే నిలిపివేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది.

## డీజీపీగా చూడాలన్న కోరికే అమ్మను బతికించింది: సీవీ ఆనంద్ భావోద్వేగం



తెలంగాణ నూతన డీజీపీగా బాధ్యతలు చేపట్టిన సీవీ ఆనంద్ తన తల్లిని ఉద్దేశించి భావోద్వేగభరిత వ్యాఖ్యలు చేశారు. ఇటీవల తన తల్లిని కలిసి ఆమె ఆశీస్సులు తీసుకున్న ఆయన, ఈ సందర్భంగా తన మనసులోని మాటలను పంచుకున్నారు. తన తల్లి గత నవంబర్ నుంచి జనవరి వరకు తీవ్ర అనారోగ్యంతో బాధపడ్డారని, ఆ సమయంలో ఆమె పరిస్థితి ఆందోళనకరంగా ఉండేదని గుర్తుచేసుకున్నారు. "ప్రస్తుతం అమ్మ ఆరోగ్యం మెరుగైంది, కానీ ఇంకా మంచానికే పరిమితమయ్యారు. తన కొడుకును ఈ రాష్ట్రానికి డీజీపీగా చూడాలన్న ఆమె బలమైన కోరికే, అనారోగ్యం నుంచి ఆమెను బయటపడేసిందని నేను బలంగా నమ్ముతున్నాను" అని సీవీ ఆనంద్ పేర్కొన్నారు. డీజీపీగా తన నియామకం గురించి తెలిసి తన తల్లి ఎంతో ఆనందపడ్డారని, ఆమె సంతోషం చూసి తానూ ఉప్పొంగిపోయానని వివరించారు. కొద్ది రోజుల క్రితమే సీనియర్ ఐపీఎస్ అధికారి సీవీ ఆనంద్, తెలంగాణ రాష్ట్ర పోలీస్ బాస్‌గా బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే.

# తిరుమలలో పెరిగిన రద్దీ..

## ఏటీజీహెచ్ వరకు క్యూలైన్లు



వారాంతం కావడంతో తిరుమల క్షేత్రం భక్తులతో కిటకిటలాడుతోంది. ఆదివారం వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌లోని అన్ని కంపార్ట్‌మెంట్లు నిండిపోయి, క్యూలైన్లు వెలుపల ఏటీజీహెచ్ వరకు విస్తరించాయి. టోకెన్లు లేని భక్తులకు సర్వదర్శనానికి సుమారు 16 గంటల సమయం పడుతోందని టీటీడీ అధికారులు తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) వెల్లడించిన వివరాల ప్రకారం, శనివారం (మే 2) ఒక్కరోజే 91,005 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా 36,257 మంది భక్తులు తలనీలాలు సమర్పించుకున్నారు. స్వామివారి హుండీ ఆదాయం రూ. 3.37 కోట్లుగా నమోదైంది. శుక్రవారంతో పోలిస్తే దర్శనానికి వచ్చిన భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగింది. భక్తుల రద్దీ అనూహ్యంగా పెరగడంతో టీటీడీ అధికారులు క్యూలైన్ల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించారు. దర్శనానికి ఎక్కువ సమయం పడుతున్నందున, భక్తులు ఈ విషయాన్ని గమనించి తమ ప్రయాణాన్ని ప్లాన్ చేసుకోవాలని సూచిస్తున్నారు. ప్రస్తుతం తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది.

# ఆకివీడు రామాలయ పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశాం: రఘురామ



పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడులో కొంతకాలంగా వివాదాలకు కేంద్ర బిందువైన రామాలయ పునర్నిర్మాణ పనులకు ఆదివారం ఉదయం శంకుస్థాపన జరిగింది. భారీ పోలీసు బందోబస్త్ మధ్య, వేలాది మంది భక్తుల సమక్షంలో ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు, ఆయన అర్ధాంగి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉదయం 7:14 గంటలకు నిర్ణయించిన ముహూర్తానికి శాస్త్రోక్తంగా భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ, ఆలయ నిర్మాణాన్ని అడ్డుకోవడానికి కొందరు కోర్టుకు వెళ్లారని, ఎన్ని అడ్డంకులు సృష్టించినా వెనక్కి తగ్గే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కృష్ణశిలతో సుమారు 800 ఏళ్లు చెక్కుచెదరని విధంగా ఆలయాన్ని నిర్మిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఆయన సోషల్ మీడియా ద్వారా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. గతంలో శ్రీరామనవమి సందర్భంగా ఈ ఆలయ నిర్మాణం విషయంలో రెండు వర్గాల మధ్య వివాదం చెలరేగడం, ఘర్షణలు చోటుచేసుకోవడం తెలిసిందే. ఈ అంశం హైకోర్టు వరకు వెళ్లగా, ప్రభుత్వ అనుమతులతోనే పనులు చేపట్టాలని న్యాయస్థానం సూచించింది. ఈ నేపథ్యంలో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారులు భారీగా పోలీసులను మోహరించారు.

# ఆసక్తికర సన్నివేశం...

## ఎర్రబెల్లి దయాకర్ రావు భుజం తట్టిన చంద్రబాబు



ప్రముఖ సినీ నటుడు, నిర్మాత బండ్ల గణేశ్ కుమార్తె జనని నిశ్చితార్థ వేడుకలో ఆసక్తికర సన్నివేశం కనిపించింది. హైదరాబాద్‌లో ఈరోజు జనని, పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన సూర్యతేజల నిశ్చితార్థం జరిగింది. ఈ వేడుకకు రాజకీయ, సినీ ప్రముఖులు హాజరయ్యారు.

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, తెలంగాణ రాష్ట్ర బీఆర్ఎస్ నాయకుడు, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఎదురుపడ్డారు. వేడుకకు హాజరయ్యేందుకు ఇద్దరూ దాదాపు ఒకే సమయంలో వచ్చారు. రాజకీయాలను పక్కనపెట్టి వారు ఆత్మీయంగా పలకరించుకున్నారు.

చంద్రబాబు కనిపించగానే ఎర్రబెల్లి దయాకర్ రావు దగ్గరకు వెళ్ళి, ఆయన చేతులు పట్టుకుని కాస్త వంగి నమస్కరించారు. చంద్రబాబు ఆయన భుజం తట్టి, నమస్కరించారు. దీంతో ఎర్రబెల్లి కూడా ప్రతినమస్కారం చేశారు. ఆ తర్వాత ఏపీ ముఖ్యమంత్రి అక్కడి నుంచి ముందుకు కదిలారు.

ఆంధ్రప్రదేశ్ విభజనకు ముందు ఎర్రబెల్లి దయాకర్ రావు తెలుగుదేశం పార్టీలో, చంద్రబాబు నేతృత్వంలో సుదీర్ఘకాలం పనిచేశారు. రాష్ట్ర విభజన తర్వాత కొంతకాలం టీడీపీలోనే ఉన్నప్పటికీ, ఆ తర్వాత టీఆర్ఎస్ (నేటి బీఆర్ఎస్)లో చేరారు. బండ్ల గణేశ్ కుమార్తె నిశ్చితార్థ వేడుకకు మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు, మెగాస్టార్ చిరంజీవి, దర్శకేంద్రుడు రాఘవేంద్రరావు, స్టార్ కమెడియన్ బ్రహ్మానందం, దర్శకుడు శ్రీను వైట్ల, శివాజీ, కోన వెంకట్, సి. కల్యాణ్, విజయవాడ మాజీ ఎంపీ లగడపాటి రాజగోపాల్ తదితరులు హాజరయ్యారు.

# బెంగాల్‌లోని 285 పోలింగ్ కేంద్రాల్లో 21న రీపోలింగ్, 24న కౌంటింగ్..




**కోల్‌కతా:** అసెంబ్లీ ఎన్నికలు జరిగిన పశ్చిమ బెంగాల్, అస్సాం, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరిలో సోమవారం కౌంటింగ్ నిర్వహించి ఫలితాలు ప్రకటించనున్నారు. అయితే పశ్చిమ బెంగాల్‌లోని ఫాల్తా నియోజకవర్గంలో మే 21న రీపోలింగ్ జరుగనున్నది. ఈ నేపథ్యంలో అక్కడి ఫలితాన్ని మే 24న ప్రకటిస్తారు. ఫాల్తా నియోజకవర్గంలోని 285 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ సందర్భంగా పలు అవకతవకలు జరిగినట్లు కేంద్ర ఎన్నికల కమిషన్ (ఈసీ) నిర్ధారించింది. బ్యాలెట్ యూనిట్లపై ఉన్న బటన్లపై నల్ల టేపులు అంటించి ఓ అభ్యర్థికి ఓటు వేయకుండా అడ్డుకున్నారని ఆరోపించింది. అలాగే ఒక నిర్దిష్ట అభ్యర్థికి ఓటు వేసిన వారిని గుర్తించడానికి బ్యాలెట్ యూనిట్ల బటన్లపై పెర్ఫ్యూమ్, సిరా పూసినట్లు నివేదికలో పేర్కొంది.కాగా, పలు పోలింగ్ కేంద్రాల వద్ద వీడియో ప్రసారంలో సుదీర్ఘ అంతరాలు ఏర్పడినట్లు ఈసీ ధృవీకరించింది. అత్యధిక ఓటింగ్ జరిగే సమయాల్లో స్టోరేజ్ చిప్‌లు ఖాళీగా ఉండటం, సంబంధం లేని ఎన్నికల ఫుటేజీని కలిగి ఉండటంతో పాటు ప్రసార అంతరాలను గుర్తించింది. ఈ నేపథ్యంలో ఓటర్లను ఓటు వేయకుండా నిరోధించడానికి లేదా బెదిరింపులు, భయపెట్టే ఎత్తుగడలతోపాటు పోలింగ్ కేంద్రాలను బలవంతంగా స్వాధీనం, బూత్ క్యాప్చరింగ్‌లకు పాల్పడినట్లు, భారీగా నకిలీ ఓటింగ్ జరిగినట్లు ఈసీ ఆరోపించింది.మరోవైపు ఈ అవకతవకల గుర్తింపుతో పాటు రీపోలింగ్ డిమాండ్ల నేపథ్యంలో ఫాల్తా నియోజకవర్గంలోని 285 పోలింగ్ కేంద్రాల్లో జరిగిన ఓటింగ్‌ను ఈసీ రద్దు చేసింది. ఆ పోలింగ్ కేంద్రాల్లో మే 21న రీపోలింగ్ నిర్వహించాలని, మే 24న కౌంటింగ్ నిర్వహించి ఫలితాన్ని ప్రకటించాలని బెంగాల్ ఈసీ ఆదేశించింది.

# సొంత పొలంలో పుచ్చకాయలు కోసిన బాలుడు.. హత్య చేసిన కౌలుదారులు




**లక్నో:** ఒక బాలుడు తన కుటుంబానికి చెందిన పొలంలో పుచ్చకాయలు కోశాడు. అయితే ఆ పొలాన్ని కౌలుకు తీసుకున్న వ్యక్తులు కత్తితో పొడిచి అతడ్ని హత్య చేశారు. ఈ సంఘటన ఆ ప్రాంతంలో ఉద్రిక్తతకు దారితీసింది. దీంతో పోలీసులను మోహరించారు. ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రా జిల్లాలో ఈ దారుణం జరిగింది. జగ్నేర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సోని ఖేడా గ్రామానికి చెందిన ఒక కుటుంబం తమ పొలాన్ని కౌలుకు ఇచ్చారు.కాగా, మే 1న ఆ కుటుంబానికి చెందిన 13 ఏళ్ల అవనీష్ కుష్వాహా సొంత పొలానికి వెళ్లాడు. ఆ పొలంలోని పుచ్చ కాయలను కోశాడు. ఆగ్రహించిన కౌలుదారులు కత్తితో పొడిచి ఆ బాలుడ్ని చంపారు. సోదరుడి కోసం వెతుకుతూ వచ్చిన సోదరి అతడి మృతదేహాన్ని చూసి షాక్ అయ్యింది. తన కుటుంబానికి ఈ విషయం చెప్పింది. ఆ కుటుంబం ఆగ్రహంతో రగిలిపోవడంతో ఆ ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొన్నది.మరోవైపు ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. బాలుడి మృతదేహాన్ని పోస్ట్‌మార్టం కోసం తరలించారు. నిందితులైన రియాజుద్దీన్, షిరాజుద్దీన్‌ను శుక్రవారం రాత్రి అరెస్ట్ చేసినట్లు పోలీస్ అధికారి తెలిపారు. ఆ ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొనడంతో పలు పోలీస్ స్టేషన్ల నుంచి అదనపు పోలీస్ బలగాలను వెల్లడించారు.

# హిమాచల్ ప్రదేశ్‌లో బస్సు బోల్తా.. 26 మందికి గాయాలు.. డ్రైవర్‌కు గుండెపోటే కారణం..



**హిమాచల్ ప్రదేశ్ :** హిమాచల్ ప్రదేశ్‌లోని కంగ్రాలో ఆదివారం బస్సు ప్రమాదం జరిగింది. బస్సు బోల్తా పడిన ఘటనలో 26 మంది ప్రయాణికులు గాయపడ్డారు. ఈ ఘటన ఉత్తర ప్రదేశ్‌లోని కంగ్రా జిల్లాలో జరిగింది. ఒక ప్రైవేటు ట్రావెల్స్ బస్సు 40 మంది ప్రయాణికులతో చంబా నుంచి ఉనా వెళ్తోంది. ఈ క్రమంలో నుర్పూర్ సమీపంలోని నియాజ్‌పూర్ వద్ద బస్సు బోల్తా పడింది. ఈ ఘటనలో బస్సులోని ప్రయాణికుల్లో 26 మందికిపైగా గాయపడ్డట్లు తెలుస్తోంది. బస్సు డ్రైవర్ గుండె పోటుకు గురికావడం, ఈ సమయంలో బస్సును నియంత్రించలేకపోవడం వల్లే బోల్తాపడి ఈ ప్రమాదం జరిగిందని ప్రాథమిక అంచనా. బస్సు అదుపుతప్పుతున్న సమయంలోనే కొందరు ప్రయాణికులు గమనించి తమను తాము రక్షించుకునేందుకు అప్రమత్తమయ్యారు. బస్సు బోల్తా పడినే వెంటనే స్థానికులు స్పందించారు. అధికారులకు వెంటనే సమాచారం అందించారు. వెంటనే అధికారులు, స్థానికులు సహాయక చర్యలు చేపట్టారు. బస్సులో చిక్కుకుపోయిన ప్రయాణికుల్ని బయటకు తీశారు.గాయపడ్డవారిని నుర్పూర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ వారికి చికిత్స అందుతోంది. ఈ 26 మందిలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయని, వారిని మెరుగైన చికిత్సకోసం టాండా మెడికల్ కాలేజీకి పంపించినట్లు వైద్యులు తెలిపారు. మిగతా వారికి గాయాలైనప్పటికీ, ప్రాణాపాయం లేదని తెలిపారు.

# జబల్‌పూర్ బోటు ప్రమాదం.. మరో రెండు మృతదేహాలు లభ్యం.. 13కి చేరిన మృతుల సంఖ్య




**మధ్యప్రదేశ్ :** మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని జబల్‌పూర్ జిల్లా బర్గీ డ్యామ్ జరిగిన క్రూయిజ్ బోటు ప్రమాదంలో మృతుల సంఖ్య 13కి పెరిగింది. ఆదివారం మరో రెండు మృతదేహాలను సహాయక బృందాలు వెలికితీశాయి. వారిలో ఐదేళ్ల బాలుడు, 50 ఏళ్ల వ్యక్తి ఉన్నారు. ఐదేళ్ల బాలుడు మయూరామ్ 50 ఏళ్ల కామరాజ్ మేనమామగా గుర్తించారు. ఈ ఇద్దరితో కలిసి బోటు ప్రమాదంలో మరణించిన వారి సంఖ్య 13కు చేరినట్లయ్యింది. మరో ఇద్దరి ఆచూకీ లభ్యం కావాల్సి ఉంది.

మూడు రోజుల క్రితం అంటే ఏప్రిల్ 30న సాయంత్రం ఈ ప్రమాదం జరిగింది. అదేరోజు స్థానికులు, సహాయక బృందాలు కలిసి 28 మందిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. మరో 9 మృతదేహాలను వెలికి తీశారు. ఆ తర్వాత రోజు మరో ఇద్దరి మృతదేహాలు లభ్యమయ్యాయి. ఇవాళ మరో రెండు మృతదేహాలు నీటిపై తేలుతుండటాన్ని రెస్క్యూ టీమ్స్ గుర్తించి బయటికి తీసుకొచ్చాయి. ఈ ఇద్దరితో కలిసి మృతుల సంఖ్య 13కు పెరిగింది. అయితే సీసీ కెమెరా ఫుటేజీని బట్టి చూస్తే ప్రమాదానికి ముందు మొత్తం 43 మంది ప్రయాణికులు బోటు ఎక్కారు. వారిలో 28 మంది సురక్షితంగా ప్రాణాలతో బయటపడగా.. 13 మంది మృతదేహాలు లభ్యమయ్యాయి. అంటే మొత్తం 43 మంది లెక్కు వచ్చారు. మరో

ఇద్దరి ఆచూకీ లభ్యం కాలేదు.

# పూనేలో మరో దారుణం.. మూడేళ్ల బాలుడిపై హత్యాచారం.. నిందితుడు మైనర్



**మహారాష్ట్ర :** మహారాష్ట్రలోని పూనేలో దారుణం జరిగింది. మూడేళ్ల బాలుడిపై మైనర్ హత్యాచారానికి పాల్పడ్డాడు. బాలుడిపై అత్యాచారం చేసిన అనంతరం నిందితుడు, చిన్నారిని చంపేశాడు. ఈ ఘటన మే 1,శుక్రవారం జరిగింది. పూనే పరిధిలో ఒకే రోజు జరిగిన రెండో చిన్నారి హత్యాచార ఘటన ఇది. బాలుడి హత్యాచారానికి సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలివి. పూనేలో ఉంటున్న ఒక కుటుంబానికి చెందిన మూడేళ్ల బాలుడిని, శుక్రవారం వారి ఇంటికి దగ్గరలో ఉండే బిహార్‌కు చెందిన ఒక మైనర్ తీసుకెళ్లాడు.చాక్లెట్లు ఇస్తానని చెప్పి నమ్మించి, బాలుడిని తను నివాసం ఉండే ఇంటికి తీసుకెళ్లాడు. అక్కడ బాలుడిపై మైనర్ అత్యాచారానికి పాల్పడ్డాడు. అయితే, విషయం ఎవరికైనా తెలిస్తే ఇబ్బంది అవుతుందని చిన్నారిని పొడిచి చంపాడు. తర్వాత బాలుడి మృతదేహాన్ని ఒక సూట్‌కేసులో ఉంచి, అక్కడి నుంచి వెళ్లిపోయాడు. తమ కొడుకు కనిపించకపోవడంతో బాలుడి తల్లిదండ్రులు చుట్టుపక్కల వెతికారు. ఇదే సమయంలో నిందితుడి ఇంటికి కూడా వెళ్లి ఆరా తీశారు. కానీ, అతడు వారిని తప్పుదోవ పట్టించాడు. దీంతో తల్లిదండ్రులు అక్కడి నుంచి వెతుక్కుంటూ వేరే చోటుకు వెళ్లిపోయారు. అయితే, ఎంత వెతికినా చిన్నారి బాలుడి ఆచూకీ కనిపించకపోవడంతో చివరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.వారి మిస్సింగ్ కేసు నమోదు చేసి బాలుడి కోసం వెతికారు. చుట్టుపక్కల సీసీ కెమెరాలు పరిశీలించారు. ఈ క్రమంలో వారి ఇంటి సమీపంలో బాలుడి మృతదేహాన్ని గుర్తించారు. అనంతరం సీసీ ఫుటేజ్ ఆధారంగా బిహార్‌కు చెందిన మైనర్ ఈ ఘాతుకానికి పాల్పడ్డట్లు గుర్తించారు. దీంతో నిందితుడి కోసం గాలించగా.. అతడు బిహార్ పారిపోయేందుకు ప్రయత్నిస్తూ రైల్వే స్టేషన్‌లో పోలీసులకు పట్టుబడ్డాడు. నిందితుడిని విచారించగా, నేరాన్ని అంగీకరించాడు. నిందితుడిపై పోక్సో సహా వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శుక్రవారం కూడా పూనే పరిధిలోనే నాలుగేళ్ల చిన్నారిని 65 ఏళ్ల వృద్ధుడు అత్యాచారం చేసి, చంపేశాడు.

# ప్రశాంతంగా ముగిసిన నీట్ యూజీ 2026 పరీక్ష.. 20 లక్షల మందికిపైగా హాజరు



**న్యూఢిల్లీ :** దేశవ్యాప్తంగా మెడిసిన్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ యూజీ -- 2026 పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో ఈరోజు మధ్యాహ్నం రెండ గంటలకు ప్రారంభమైన ఈ పరీక్ష సాయంత్రం 5 గంటలకు ముగిసింది. ఈ ఏడాది దేశ వ్యాప్తంగా 552 నగరాలు, 14 అంతర్జాతీయ కేంద్రాల్లో కలిపి సుమారు 20 లక్షల మందికి పైగా విద్యార్థులు నీట్ పరీక్షకు హాజరయ్యారు.పరీక్ష నిర్వహణ కోసం ఎన్‌టీఏ కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసింది. విద్యార్థులను ఉదయం 11 గంటల నుంచే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించారు. మధ్యాహ్నం 1.30 గంటలకు గేట్లు మూసివేసి ఆ తర్వాత వచ్చిన వారిని లోపలికి అనుమతించలేదు. పరీక్ష కేంద్రాల వద్ద డ్రెస్ కోడ్‌తోపాటు ఇతర నిబంధనలను కఠినంగా అమలు చేశారు. అడ్మిట్ కార్డు, ఫొటో, ప్రభుత్వ గుర్తింపు కార్డు ఉన్నవారిని క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలికి పంపించారు. విద్యార్థులకు 1.45 గంటలకు ప్రశ్నపత్రాలు, ఓఎంఆర్ షీట్లు అందజేసి, రెండు గంటలకు పరీక్ష ప్రారంభించారు. పరీక్ష ప్రశాంతంగా ముగియడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

## కేరళలో మారుతున్న అధికారం ఫలితాలకు ముందే సీఎం విజయన్ షాకింగ్ నిర్ణయం



**కేరళ :** కేరళ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడటానికి ముందే ఆ రాష్ట్ర రాజకీయాల్లో పెను సంచలనం చోటుచేసుకుంది. ముఖ్యమంత్రి పినరయి విజయన్ తన సోషల్ మీడియా ఖాతాలో చేసిన ఓ మార్పు ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. కేరళ అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు కేవలం ఒక్కరోజు ముందు ముఖ్యమంత్రి పినరయి విజయన్ తన సోషల్ మీడియా (ఎక్స్, ఫేస్‌బుక్) బయోలో కీలక మార్పులు చేశారు. గతంలో తన బయోలో 'కేరళ ముఖ్యమంత్రి' అని ఉండగా.. దానిని తొలగించి ఇప్పుడు కేవలం 'పొలిట్ బ్యూరో సభ్యుడు, భారత కమ్యూనిస్ట్ పార్టీ (మార్క్సిస్ట్)' అని మార్చుకున్నారు. ఫలితాలు రాకముందే ఆయన ఈ నిర్ణయం తీసుకోవడం అధికార మార్పిడికి సంకేతమా? లేక ఓటమిని అంగీకరించడమేనా? అనే చర్చలు రాజకీయ వర్గాల్లో మొదలయ్యాయి.ఎగ్జిట్ పోల్స్ అంచనాలు.. ఎల్డీఎఫ్‌కు షాక్?ఈసారి వెలువడిన దాదాపు అన్ని ఎగ్జిట్ పోల్స్ కేరళలో అధికార మార్పిడి జరుగుతుందని అంచనా వేశాయి. అధికార ఎల్డీఎఫ్ కూటమి వెనుకబడిందని.. కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కూటమికి స్పష్టమైన మెజారిటీ లభించే అవకాశం ఉందని సర్వేలు పేర్కొన్నాయి. ఈ అంచనాల నేపథ్యంలోనే ముఖ్యమంత్రి తన హోదాను సోషల్ మీడియా నుంచి తొలగించారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే దీనిపై పార్టీ వర్గాల నుంచి ఇంకా అధికారిక వివరణ రాలేదు.

ధర్మడమ్ స్థానంలో హోరాహోరీ పోరుపినరయి విజయన్ తన సొంత గడ్డ అయిన ధర్మడమ్ నియోజకవర్గం నుండి వరుసగా మూడోసారి విజయం సాధించాలని పట్టుదలతో ఉన్నారు. గతంలో 2016, 2021 ఎన్నికల్లో ఆయన ఇక్కడ భారీ మెజారిటీతో విజయం సాధించారు. అయితే ఈసారి కాంగ్రెస్ అభ్యర్థి వీపీ అబ్దుల్ రషీద్, బీజేపీ అభ్యర్థి కె. రంజిత్ నుంచి ఆయనకు గట్టి పోటీ ఎదురైనట్లు తెలుస్తోంది. కంచుకోట వంటి ఈ స్థానంలో ఓట్ల శాతం తగ్గడం కూడా వామపక్ష కూటమిని ఆందోళనకు గురిచేస్తోంది.మే 4న తేలనున్న కేరళ భవిష్యత్తు కేరళలో ఏప్రిల్ 9న ఒకే దశలో జరిగిన ఎన్నికల్లో దాదాపు 78.27 శాతం ఓటింగ్ నమోదైంది. గత పదేళ్లుగా అధికారంలో ఉన్న ఎల్డీఎఫ్ హ్యాట్రిక్ సాధిస్తుందా? లేదా కేరళ సంప్రదాయం ప్రకారం మళ్లీ యూడీఎఫ్ అధికారంలోకి ఫలితాల్లో తేలిపోనుంది.

# ఇటుకలతో కొట్టి నలుగురు పిల్లల దారుణ హత్య.. పరారీలో తల్లి



**లక్నో:** తోబుట్టువులైన నలుగురు పిల్లలను ఇటుకలతో కొట్టి దారుణంగా హత్య చేశారు. ఇంటి లోపల నుంచి లాక్ వేసి పారిపోయారు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకున్నారు. పరారీలో ఉన్న పిల్లల తల్లిపై అనుమానం వ్యక్తం చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని అంబేద్కర్ నగర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. మురాదాబాద్ మొహల్లాలో తాళం వేసి ఉన్న ఒక ఇంటి లోపల నలుగురు పిల్లల మృతదేహాలు పడి ఉన్నాయని శనివారం మధ్యాహ్నం పోలీసులకు సమాచారం అందింది. దీంతో వారు అక్కడకు చేరుకున్నారు.కాగా, లోపల నుంచి లాక్ వేసి ఉన్న ఆ ఇంట్లోకి పోలీసులు ప్రవేశించారు. తోబుట్టువులైన నలుగురు పిల్లలను ఇటుకలతో కొట్టి దారుణంగా హత్య చేసినట్లు గమనించారు. మృతుల్లో ముగ్గురు బాలురు, ఒక బాలిక ఉన్నారు. సఫిక్ (14), సౌద్ (12), ఉమర్ (10), బయాన్ బానో (8)గా వారిని గుర్తించారు. సొంత తోబుట్టువులైన ముస్లిం పిల్లల మృతదేహాలను పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.మరోవైపు పిల్లల తల్లి పేరుతో ఆ ఇల్లు రిజిస్టర్ అయినట్లు పోలీసులు తెలుసుకున్నారు. పిల్లలను చంపిన తర్వాత గోడ దూకి ఆమె పారిపోయినట్లు అనుమానిస్తున్నారు. ఫోరెన్సిక్ బృందాన్ని రప్పించి ఆధారాలు సేకరించారు. ఆ ఇంటిని సీజ్ చేశారు.

# సామాన్యులకు బిగ్ షాక్.. పాల ధరలు భారీగా పెంపు



**న్యూఢిల్లీ :** పశ్చిమాసియాలో ఉద్రిక్తతల కారణంగా ఇప్పటికే దేశంలోని అనేక ప్రాంతాల్లో పెట్రోల్, డీజిల్ కొరత ఏర్పడింది. అలాగే గ్యాస్ సిలిండర్ సరఫరాలోనూ ఆలస్యం జరుగుతోంది. దాంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చాలా ప్రాంతాల్లోని పెట్రోల్ బంకుల్లో నో స్టాక్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. అలాగ గ్యాస్ సిలిండర్ సరఫరాలో జాప్యం నెలకొంది. ఈ క్రమంలో తాజాగా పాల ధరలను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఒక్కో లీటర్ పై రూ. 4 పెంచుతూ ఆదేశాలు ఇచ్చింది. పెంచిన ధరలు మే 3 ఆదివారం నుంచి అమల్లోకి రానున్నాయి. దాంతో రాష్ట్రంలోని పేద, మధ్య తరగతి ప్రజలకు ఇది పెద్ద షాక్ అని చెప్పొచ్చు.ఒడిశా రాష్ట్ర సహకార పాలు ఉత్పత్తిదారుల సమాఖ్య పాల ధరలను పెంచింది. లీటర్ కు రూ. 4 చొప్పున పెంచుతూ కీలక నిర్ణయం తీసుకుంది. పెరిగిన పాల ధరలు మే 3 ఆదివారం నుంచి అమల్లోకి వచ్చాయి. పెరిగిన పాల ధరల ప్రకారం వివిధ పాల ప్యాకెట్ల ధరలు చూస్తే.. టోన్ మిల్క్ ధర లీటరు ప్రస్తుతం రూ. 50 ఉండగా అది కాస్తా రూ. 54 కు చేరింది. ఇక ప్రీమియం మిల్క్ ధర లీటర్ రూ. 54 నుంచి రూ. 58 కు చేరింది. అలాగే గోల్డ్ ప్రీమియం పాల ధర లీటర్ రూ. 56 నుంచి రూ. 60 కు పెరిగింది. చివరగా గోల్డ్ ప్రీమియం ప్లస్ పాల ప్యాకెట్ ధర లీటర్ రూ. 60 నుంచి రూ. 64 కు చేరింది.రాష్ట్రంలో పాల సేకరణ, ప్రాసెసింగ్, రవాణా ఖర్చులు, ప్యాకేజింగ్ ఖర్చులు పెరిగిన నేపథ్యంలో పాల ధరలను పెంచినట్లు ఒడిశా రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి గోకులానంద మల్లిక్ వివరణ ఇచ్చారు. ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్లు స్పష్టం చేశారు. పాల ధరల పెంపు కారణంగా రాష్ట్రంలోని దాదాపు 3 లక్షల మంది పాడి రైతులకు ప్రయోజనం చేకూరనుంది. ఇక రాష్ట్రంలో పాల సేకరణ ధర కూడా పెరిగింది. ఆవు పాలు లీటర్ కు రూ.1 పెంచడం కారణంగా రైతులకు చెల్లించే ధర రూ. 40 కు చేరుకుంది. అలాగే గేదె పాల సేకరణ ధర కూడా పెంచారు.

# ఆ వేధింపులకు గురైంది నేనే: మౌనం వీడిన స్టార్ రెజ్లర్

భారత కుస్తీ ప్రపంచంలో ప్రకంపనలు సృష్టిస్తూ స్టార్ రెజ్లర్ ఒలింపియన్ వినేష్ ఫోగాట్ సంచలన నిజాన్ని బయటపెట్టారు. రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా మాజీ అధ్యక్షుడు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు చేసిన ఆరుగురు మహిళా క్రీడాకారిణులలో తాను కూడా ఒకరినని ఆమె మొదటిసారిగా బహిరంగంగా అంగీకరించారు. ఆదివారం (మే 3) విడుదల చేసిన ఓ భావోద్వేగ వీడియో సందేశంలో వినేష్ ఫోగాట్ తన గోడును వెళ్లగక్కారు. ఈ కేసు ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉండటం, బాధితుల గుర్తింపును రహస్యంగా ఉంచాలన్న సుప్రీంకోర్టు మార్గదర్శకాల కారణంగా తాను ఇప్పటివరకు మౌనంగా ఉన్నానని ఆమె తెలిపారు. అయితే ప్రస్తుతం తన రీ-ఎంట్రీకి ఎదురవుతున్న అడ్డంకులు, రెజ్లింగ్ ఫెడరేషన్ వైఖరి తనను ఈ నిజాన్ని బయటపెట్టేలా చేశాయని ఆమె పేర్కొన్నారు.ట్రయల్స్ వేదికపై అభ్యంతరం2026 ఆసియా క్రీడలకు ముందు నిర్వహించబోయే సెలక్షన్ ట్రయల్స్ వేదికపై వినేష్ ఫోగాట్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ ట్రయల్స్‌ను



కావాలనే ఉత్తరప్రదేశ్‌లోని గోండాలో నిర్వహిస్తున్నారని ఆమె ఆరోపించారు. గోండా అనేది బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌కు కంచుకోట వంటిదని, అక్కడ ఒక ప్రైవేట్ కళాశాలలో పోటీలు నిర్వహించడం ద్వారా పారదర్శకత లోపిస్తుందని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. బ్రిజ్ భూషణ్ ప్రభావం ఉన్న చోట నిష్పక్షపాతంగా ఎంపిక జరుగుతుందన్న నమ్మకం లేదని వినేష్ ఫోగాట్ స్పష్టం చేశారు.వ్యవస్థపై బ్రిజ్ భూషణ్ పట్టు

బ్రిజ్ భూషణ్ ప్రస్తుతం అధికారిక పదవిలో లేకపోయినా.. కుస్తీ సమాఖ్య కార్యకలాపాలపై ఆయన ప్రభావం ఇంకా కొనసాగుతోందని వినేష్ ఫోగాట్ ఆరోపించారు. "నేను స్వయంగా ఫిర్యాదు చేసిన ఆరుగురు బాధితుల్లో ఒకరిని, ప్రస్తుతం నా సాక్ష్యం కోర్టులో కొనసాగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఆయన ఇలాకాలోకి వెళ్లి పోటీ చేయడం మానసికంగా, భావోద్వేగపరంగా చాలా కష్టం" అని ఆమె అన్నారు. మ్యాచ్ రెఫరీలు ఎవరు ఉండాలి, ఎవరికి ఎన్ని పాయింట్లు ఇవ్వాలి అనే విషయాల్లో బ్రిజ్ భూషణ్ అనుచరుల జోక్యం ఉంటుందని వినేష్ ఫోగాట్ అనుమానం వ్యక్తం చేశారు. 2023లో వినేష్ ఫోగాట్, సాక్షి మాలిక్, బజరంగ్ పునియా వంటి అగ్రశ్రేణి రెజ్లర్లు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సుదీర్ఘ నిరసనలు చేపట్టిన సంగతి తెలిసిందే. ఆ సమయంలో క్రీడాకారుల పట్ల పోలీసులు ప్రవర్తించిన తీరు అంతర్జాతీయ స్థాయిలో విమర్శలకు దారితీసింది. బ్రిజ్ భూషణ్ ఈ ఆరోపణలను వరుసగా తోసిపుచ్చుతున్నప్పటికీ, లైంగిక వేధింపుల కేసులో విచారణ ఇంకా కొనసాగుతూనే ఉంది. సుమారు 18 నెలల విరామం తర్వాత తిరిగి రింగ్‌లోకి రావాలని చూస్తున్న వినేష్‌కు, తాజా పరిస్థితులు సవాలుగా మారాయి. ఈ వ్యవహారంపై క్రీడా మంత్రిత్వ శాఖ ఎలా స్పందిస్తుందో చూడాలి.

# ముంబై ఇండియన్స్ ప్లేఆఫ్స్ కు చెక్



ముంబై ఇండియన్స్ ఐపీఎల్ ప్లేఆఫ్ చేరే అవకాశాలకు చెక్ పడింది. చెన్నై సూపర్ కింగ్స్ తో జరిగిన మ్యాచ్ లో ఓడిపోవడంతో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. శనివారం రాత్రి చెన్నై చెపాక్ చిదంబరం స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్‌లో చెన్నై సూపర్ కింగ్స్ చేతిలో ఎనిమిది వికెట్ల తేడాతో ఓటమి పాలైంది ముంబై ఇండియన్స్. ఈ జట్టు నిర్దేశించిన 159 పరుగుల లక్ష్యాన్ని రుతురాజ్ గైక్వాడ్ అజేయ అర్ధసెంచరీతో చెన్నై సునాయసంగా అందుకుంది. ప్రత్యర్థులపై సీజన్ డబుల్ పూర్తిచేసింది.

ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ కు దిగిన ముంబై ఇండియన్స్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 159 పరుగులు చేసింది. నమన్ ధీర్ 57 హాఫ్ సెంచరీతో రాణించినా.. మిగతా బ్యాటర్లు విఫలం అయ్యారు. మొన్నటి మ్యాచ్ లో సెంచరీతో అదరగొట్టిన ర్యాన్ రికెల్టన్ ఇక్కడ కూడా దూకుడుగా ఆడాడు గానీ ఎక్కువ సేపు క్రీజ్ లో నిల్చోలేకపోయాడు. సూర్యకుమార్ యాదవ్- 21, కేప్టెన్ హార్దిక్ పాండ్యా- 18, తిలక్ వర్మ- 5 మళ్లీ విఫలం అయ్యా రు. అనంతరం సీఎస్‌కే 18.1 ఓవర్లలో 2 వికెట్లకు 160 పరుగులు చేసి సునాయస విజయాన్నందుకుంది. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్- 67, కార్తీక్ శర్మ- 54 అజేయ హాఫ్ సెంచరీలతో సత్తా చాటారు. ఓపెనర్ సంజు శాంసన్ 11 పరుగులే చేసినా మరో ఓపెనర్ ఉర్విల్ పటేల్ దూకుడుగా ఆడాడు. ఈ ఓటమితో ముంబై ఇండియన్స్ ప్లేఆఫ్స్ అవకాశాలు సంక్లిష్టం అయ్యాయి. తొమ్మిది మ్యాచ్‌లలో రెండు విజయాలతో నాలుగు పాయింట్లు మాత్రమే ఈ జట్టు ఖాతాలో ఉన్నాయి. ప్లేఆఫ్స్ చేరాలంటే.. మిగిలిన అయిదు మ్యాచ్‌లలోనూ గెలిస్తే గరిష్ఠంగా 14 పాయింట్లను చేరుకుంటుంది. 14 పాయింట్లతో ప్లేఆఫ్‌లకు అర్హత సాధించడం సాధ్యమే అయినప్పటికీ, అది ఇతర జట్ల అనుకూల ఆధారపడి ఉంటుంది.

## హార్దిక్ కు సహకరించట్లేదా బాంబుపేల్చిన మాజీ..



ఇండియన్ ప్రీమియర్ లీగ్ అత్యంత చెత్త ప్రదర్శనతో టోర్నీ నుంచి దాదాపు నిష్క్రమించిన ముంబై ఇండియన్స్ జట్టుకు కెప్టెన్ గా ఉన్న హార్దిక్ పాండ్యా అంతకంటే ఎక్కువ విమర్శలే ఎదుర్కొంటున్నాడు. కెప్టెన్ గా, బ్యాటర్ గా, బౌలర్ గా విఫలమవుతున్న హార్దిక్ పాండ్యా వల్లే జట్టు ఇలాంటి పరిస్థితుల్లో ఉందన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. అయితే హార్దిక్ సొంత వైఫల్యం ఓ ఎత్తు, జట్టు నుంచి అందని సహకారం మరో ఎత్తని భారత మాజీ క్రికెటర్ మనోజ్ తివారీ వెల్లడించాడు.తాజాగా చెన్నై సూపర్ కింగ్స్ చేతిలో ఓడిపోయి, ఈ సీజన్‌లో ముంబై ఇండియన్స్ తమ ఏడో ఓటమిని చవిచూసిన తర్వాత, హార్దిక్ విమర్శల నుండి తప్పించుకోవడం కష్టంగా మారింది. అయితే ఈ సీజన్‌లో ముంబై పేలవ ప్రదర్శనకు ప్రధాన కారణంగా హార్దిక్‌ను ముద్ర వేయడం సరికాదని భారత మాజీ బ్యాటర్ మనోజ్ తివారీ అభిప్రాయపడ్డాడు. ఎందుకంటే, అతను కోరుకున్న స్థాయిలో సహచర ఆటగాళ్ల నుండి అతనికి మద్దతు లభించలేదని అన్నాడు. క్రిక్‌బజ్‌లో మాట్లాడుతూ తివారీ.. ముంబై ఐపీఎల్ 2026 సీజన్ ఇప్పటికే ముగిసిపోయిందని తేల్చేశాడు.జట్టు వైఫల్యాల నిందలను భరించాల్సి వచ్చినప్పుడు, ఇతరుల నుండి ఎలాంటి మద్దతు లేకుండా ముంబై కెప్టెన్ ఇంతకాలం ఒంటరిగా నిలబడాల్సి వచ్చిందని మనోజ్ తివారీ తెలిపాడు.ఒక కెప్టెన్ ప్రతి ఆటగాడి నమ్మకాన్ని గెలుచుకోవాలని, అతను ఒక నాయకుడిగా ఉండాలని, అయితే, హార్దిక్‌కు ఎవరూ అండగా నిలబడటం లేదనిపిస్తోందన్నాడు. అతనికి అవసరమైన మద్దతు అస్సలు లేదన్నాడు. కెప్టెన్‌కు ఒక పాత్ర ఉందని, కానీ అతను సరిగ్గా ఆడటం లేదన్నాడు. కానీ అంతకు మించి, ఇతర ఆటగాళ్లు బాధ్యత తీసుకోవాలన్నాడు. ఉదాహరణకు సూర్య నిలకడగా రాణించడం లేదని, తిలక్ ఒక మంచి మ్యాచ్ తర్వాత తన ఫామ్‌ను కొనసాగించలేదని గుర్తుచేశాడు. జట్టు నుండి ఎలా ప్రశ్నించాడు.

# నక్కతోక తొక్కొచ్చిన రాజస్థాన్ రాయల్స్: రూ. 15,600 కోట్ల భారీ డీల్ సెట్

ఇండియన్ ప్రీమియర్ లీగ్ లో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. టాప్ ఫ్రాంచైజీల్లో ఒకటైన రాజస్థాన్ రాయల్స్ చేతులు మారింది. దీనికి సంబంధించి ఓ భారీ డీల్ కుదిరింది. దేశీయ పారిశ్రామిక దిగ్గజాలు లక్ష్మీ నివాస్ మిట్టల్, ఆదిత్య మిట్టల్ దీన్ని కొనుగోలు చేశారు. వారి సారథ్యంలోని కన్సార్టియం రాజస్థాన్ రాయల్స్ ను కొనుగోలు చేసింది. దీని విలువ 15,600 కోట్ల రూపాయలు. సీరమ్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ ఇండియా అధినేత ఆదార్ పూనావాలా కూడా ఈ కన్సార్టియంలో ఉన్నారు. ఈ ఒప్పందంలో ఐపీఎల్ జట్టుకు మాత్రమే పరిమితం కాలేదు. దక్షిణాఫ్రికా ప్రీమియర్ లీగ్ ఎస్ఏ20 ఫ్రాంచైజీ పెర్ల్ రాయల్స్, కరీబియన్ ప్రీమియర్ లీగ్ టీమ్ బార్బడోస్ రాయల్స్ కూడా ఉన్నాయి. ఈ మూడు టీమ్ లను కూడా ఇప్పుడున్న రాజస్థాన్ రాయల్స్ యాజమాన్యం నుంచి కొనుగోలు చేసింది ఈ మిట్టల్ ఫ్యామిలీ, ఆదార్ పూనావాలాతో కూడిన కన్సార్టియం. డీల్ పూర్తయిన తర్వాత.. ఇందులో మిట్టల్ కుటుంబానికి సుమారు 75 శాతంవాటా లభిస్తుంది. అదార్ పూనావల్ల దాదాపు 18 శాతం స్టేక్స్ ను కలిగి ఉంటారు.

మిగిలిన ఏడు వాటా ప్రస్తుత ఫ్రాంఛైజీ యాజమాన్యం మనోజ్ బదాలే వద్దే ఉంటుంది. ఈ ఫ్రాంచైజీతో అనుబంధంగా కొనసాగుతారు బదాలే. ఈ డీల్‌కు బీసీసీఐ, కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా, ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ ఇంకా ఆమోదించాల్సి ఉంది. వీటితో పాటు ఇతర రెగ్యులేటరీ అథారిటీల ఆమోదం ఇంకా లభించలేదు. ఈ ప్రక్రియ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికం నాటికి అంటే అక్టోబర్- నవంబర్- డిసెంబర్ నాటికి పూర్తవుతుందని అంచనాఈ ఒప్పందం కార్యరూపం దాల్చిన తర్వాత లక్ష్మీ నివాస్ మిట్టల్, ఆదిత్య మిట్టల్, వనిషా మిట్టల్ భాటియా, అదార్



పూనావాలా, మనోజ్ బదాలే.. రాజస్థాన్ రాయల్స్ బోర్డులో చేరుతారు. ఈ భారీ డీల్ పై లక్ష్మీ నివాస్ మిట్టల్ స్పందించారు. రాజస్థాన్‌తో తనకు దీర్ఘకాల అనుబంధం ఉందని, అలాగే క్రికెట్ అన్నా తనకు ఎంతగానో ఇష్టమని పేర్కొన్నారు. ఈ కారణంతోనే క్రికెట్ ను ఆస్వాదించడానికి రాజస్థాన్ రాయల్స్ కంటే మెరుగైన జట్టు మరేదీ ఉండదని వ్యాఖ్యానించారు.

# కాక మీదున్న సన్‌రైజర్స్ తో కేకేఆర్ క్లాష్: తుదిజట్టులో..

ఈ ఇండియన్ ప్రీమియర్ లీగ్ సీజన్ లో సన్‌రైజర్స్ హైదరాబాద్ (ూ=ుం) తడాఖా చూపుతోంది. భారీ విజయాలతో దూసుకెళ్తోంది. వరుసగా అయిదు విజయాలను తన ఖాతలో వేసుకుంది. మొన్నటికి మొన్న ముంబై ఇండియన్స్ ను వాళ్ల సొంత గడ్డ వాంఖెడే స్టేడియంలో చితగ్గొట్టడం అదరహో అనిపించుకుంది. ఈ మ్యాచ్ లో ఓడిన దెబ్బకు ముంబై ఇండియన్స్ పాయింట్ల పట్టికలో అట్టడుగుకు చేరింది. ప్లేఆఫ్స్ పై దాదాపుగా ఆశలు వదులు కున్నట్టయింది.ఈ ఐపీఎల్ సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టు ప్రదర్శన ఎంతగానో ఆకటుకుంటోంది. గెలవడం ఒక అలవాటుగా మార్చుకున్న ఈ జట్టు పూర్తి ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తోంది. రాజస్థాన్ రాయల్స్‌ను నిలువరించినప్పటి నుండి దాని దశ తిరిగింది. ప్రఫుల్ హింగే, సాకిబ్ హుస్సేన్ వంటి పెద్దగా తెలియని ఆటగాళ్లు కూడా అద్భుత ప్రదర్శన చేయడంతో సన్‌రైజర్స్ అయిదు వరుస విజయాలను నమోదు చేసింది. చివరి రెండు విజయాలు 200లకు పైగా లక్ష్యాలను అందుకున్నవే కావడం, పైగా ప్రత్యర్థి గ్రౌండ్ లో దీన్ని సాధించడంకోల్‌కతా నైట్ రైడర్స్‌తో తలపడబోతోంది సన్ రైజర్స్ హైదరాబాద్. ఈ మధ్యాహ్నం 3:30 గంటలకు మ్యాచ్ ఆరంభమౌతుంది. బ్యాటింగ్ లో అద్భుతమైన ఫామ్‌లో ఉందీ సన్ రైజర్స్. అభిషేక్ శర్మ- 425, హెన్రిచ్ క్లాసెన్ 414 పరుగులు చేసి, బ్యాటింగ్ ఛార్ట్‌లో వరుసగా రెండు, మూడో స్థానాల్లో నిలిచారు. ఇషాన్ కిషన్ కూడా 312 పరుగులతో రాణిస్తున్నాడు. హెన్రిచ్ క్లాసెన్ ఒత్తిడిలో అద్భుతమైన ప్రదర్శన కనబరిచాడు.

ముంబై ఇండియన్స్‌పై 30 బంతుల్లో అజేయంగా 65 పరుగులు చేసి జట్టును విజయపథంలో నడిపిన తీరు క్లాసెన్ సామర్థ్యాన్ని చాటింది. ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ భారీ స్కోర్ చేస్తోన్నప్పటికీ.. నిలకడగా ఆడట్లేదు. క్లాసెన్ అలాక్కాదు. ప్రతి మ్యాచ్ లోనూ మినిమమ్ గ్యారంటీతో పరుగులు రాబట్టుకుంటోన్నాడు. మిడిలార్డర్ లో బ్యాటింగ్ బ్యాక్ బోన్ గా నిలుస్తున్నాడు. బౌలింగ్ లో ఎహసాన్ మలింగ సత్తా చాటుతున్నాడు. జట్టు



విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాడు.

ఇప్పటి వరకు సన్ రైజర్స్, కోల్ కత నైట్ రైడర్స్ మధ్య మొత్తం 31 మ్యాచ్‌లు జరిగాయి. వీటిల్లో సన్‌రైజర్స్ 11 గెలిచింది. 20 గేమ్ లల్లో నైట్ రైడర్స్ సత్తా చాటింది. తాజాగా ఈ మ్యాచ్ కు ఆతిథ్యాన్ని ఇస్తోన్న ఉప్పల్ పిచ్ బ్యాటింగ్ ఫ్రెండ్లీ పిచ్. ఛేజింగ్‌కు అనుకూలంగా ఉండొచ్చు.

సన్‌రైజర్స్ హైదరాబాద్ ప్లేయింగ్ 11లో.. అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్, ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), హెన్రిచ్ క్లాసెన్, నితీష్ కుమార్ రెడ్డి, సలీల్ అరోరా, అనికేత్ వర్మ, పాట్ కమిన్స్ (కెప్టెన్), హర్ష్ దూబే, సాకిబ్ హుస్సేన్, ప్రఫుల్ హింగే ఆడే అవకాశం ఉంది.

# సన్‌రైజర్స్‌కు ఊహించని స్ట్రోక్.. ఆరో విజయాన్ని అడ్డుకున్న కోల్‌కతా..!

అదిరే ఆటతో వరస విజయాలతో దూసుకెళ్తున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ కల చెదిరింది. డబుల్ హ్యాట్రిక్‌తో టేబుల్ టాపర్ అవ్వాలనుకున్న కమిన్స్ సేనకు కోల్‌కతా నైట్ రైడర్స్ బిగ్ షాకిచ్చింది. మిస్టరీ స్పిన్నర్లు తిప్పేయడంతో హిట్టర్లతో నిండిన హైదరాబాద్‌ను 165 పరుగుల వద్దే ఆపిన కోల్‌కతా రఘువంశీ(59), సారథి అజింక్యా రహానే(43)ల విలువైన భాగస్వామ్యం నెలకొల్పారు. వైస్ కెప్టెన్ రింకూ సింగ్(18 నాటౌట్) లాంఛనం ముగించడంతో కోల్‌కతా మూడో విజయంతో మురిసింది.పంతొమ్మిదో సీజన్‌లో చెలరేపోతున్న సన్‌రైజర్స్ హైదరాబాద్ జోరుకు కోల్‌కతా నైట్ రైడర్స్ బ్రేకులు వేసింది. ఉప్పల్ స్టేడియంలో బ్యాటర్లు తేలిపోవడంతో తక్కువ స్కోర్ కొట్టిన సన్‌రైజర్స్ హైదరాబాద్‌ను బౌలర్లు కాపాడలేకపోయారు. స్వల్ప లక్ష్యాన్ని కోల్‌కతా ఆడుతూపాడుతూ ఛేదించింది. ఆరెంజ్ ఆర్మీని 165కే కట్టడి చేసిన కేకేఆర్‌కు ఓపెనర్లు శుభారంభిం మిచ్చారు.

కోల్‌కతాను గెలుపు దిశగా నడిపించిన ఈ



జోడీని విడదీసేందుకు సన్‌రైజర్స్ సారథి కమిన్స్ బౌలర్లను మార్చినా ఫలితం లేకపోయింది. జట్టు విజయానికి 33 రన్స్ అవస రమైన వేళ షకీబ్ ఓవరర్లో రహానే ఔట య్యాడు. కాసేపటికే రఘువంశీని శివాంగ్ వెనక్కి పంపాడు. అప్పటికే లక్ష్యం కరిగిపోగా.. వైస్ కెప్టెన్ రింకూ సింగ్(18 నాటౌట్), గ్రీన్(3 నాటౌట్) లాంఛనం ముగించారు. దాంతో, వరసగా ఆరో విజయంతో టాప్‌లోకి దూసుకెళ్లాలనుకున్న హైదరాబాద్ ఆశలు ఆడియాశలయ్యాయి.హెడ్, ఇషాన్ దంచినా.. సొంత గడ్డపై భారీ స్కోర్‌తో అనూహ్యంగా తడబడింది

## రూ. 14 కోట్లకి ఫైనల్‌గా న్యాయం చేసిన సీఎస్కే కుర్రోడు.. హాఫ్ సెంచరీతో ముంబైని మట్టికరిపించిన కార్తీక్ శర్మ

చెన్నై సూపర్ కింగ్స్ కాస్ట్లీ ప్లేయర్ కార్తీక్ శర్మ ఎట్టకేలకు ఫామ్‌లోకి వచ్చాడు. రూ. 14.2 కోట్లతో కొనుగోలు చేసిన కార్తీక్ శర్మ ఎట్టకేలకు తాను తీసుకున్న డబ్బులకు న్యాయం చేశాడు. ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో కార్తీక్ శర్మ 40 బంతుల్లో నాలుగు ఫోర్లు, మూడు సిక్సర్లతో 54 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. కార్తీక్ శర్మ పర్ఫార్మెన్స్‌కు సీఎస్కే హెడ్ కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్, కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్ ఫిదా అయ్యారు.

దేశీయ క్రికెట్‌లో రాణించిన కార్తీక్ శర్మ ఈ ఐపీఎల్ ఆరంభంలో పెద్దగా ప్రభావం చూపలేదు. ఐదు మ్యాచ్‌లలో అవకాశం ఇచ్చినా తనను తాను నిరూపించుకోలేకపోయాడు. దాంతో చివరగా ముంబై ఇండియన్స్ మీద ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవడమే కాకుండా.. కీలక మ్యాచ్‌ని గెలిపించి గన్ సెలబ్రేషన్స్ చేసుకున్నాడు. హెడ్ కోచ్, బ్యాటింగ్ కోచ్, కెప్టెన్‌తో సహా అందరూ ఇప్పుడు కార్తీక్ శర్మను ఆకాశానికి ఎత్తేస్తున్నారు.చెపాక్ స్టేడియం వేదికగా ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కి వచ్చిన కార్తీక్ శర్మ 40 బంతుల్లో నాలుగు ఫోర్లు, మూడు సిక్సర్లతో 54 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. క్లాస్ షాట్స్ ఆడుతూ.. అనవసర ప్రయోగాలకు వెళ్లకుండా సెలెక్టర్లు, కోచ్‌లను మెప్పించాడు. కార్తీక్ శర్మ, రుతురాజ్ అద్భుత భాగస్వామ్యం అందించడంతో ముంబైపై చెన్నై 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది.కార్తీక్ శర్మ




చాలా మంచి ఆట ఆడాడని హెడ్ కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ అన్నాడు. వేలంలో మిగతా ప్లేయర్లతో పోల్చితే భారీ ధరే పలికినప్పటికీ దానికి తగ్గ ఫలితం ఈ రోజు మ్యాచ్‌లో చూయించాని చెప్పాడు. కార్తీక్ శర్మ రోజురోజుకూ తన ఆటతీరును మెరుగుపరుచుకుంటూ, జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించడం చాలా సంతోషంగా ఉందని ఫ్లెమింగ్ అన్నాడు.

# రోవ్‌మన్ కాదు, సూపర్ మ్యాన్ పోవెల్.. కళ్లు చెదిరే క్యాచ్‌తో క్లాసెన్‌కు షాక్..!

సన్‌రైజర్స్ హైదరాబాద్ విజయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న హెన్రిచ్ క్లాసెన్.. కేకేఆర్‌తో మ్యాచులో తక్కువ స్కోరుకే ఔట్ అయ్యాడు. అయితే క్లాసెన్ ఇలా ఔట్ కావడంలో కేకేఆర్ ఆల్ రౌండర్ రోవ్‌మన్ పావెల్ కీలక పాత్ర పోషించాడు. ఒంటి చేత్తో కళ్లు చెదిరే క్యాచ్ పట్టి.. అతడిని పెవిలియన్‌కు పంపించాడు. డీప్ మిడ్ వికెట్ వద్ద ఉన్న పోవెల్ అద్భుతంగా పక్కకు పరుగెత్తి గాల్లోకి జంప్ చేస్తూ ఒంటిచేత్తో బంతిని ఒడిసిపట్టుకున్నాడు. కిందపడినా బ్యాలెన్స్ కోల్పోకుండా బంతిని వదల్లేదు. ఈ క్యాచ్‌తో క్లాసెన్ కేవలం 11 పరుగులకే వెనుదిరగాల్సి వచ్చింది.ఐపీఎల్ 2026లో భాగంగా సన్ రైజర్స్ హైదరాబాద్, కోల్‌కతా నైట్ రైడర్స్ మ్యాచ్‌లో కళ్లు చెదిరే క్యాచ్ పట్టాడు రోవ్‌మన్ పోవెల్ . ఉప్పల్ వేదికగా జరిగిన ఈ మ్యాచులో సూపర్ క్యాచ్‌తో సన్ రైజర్స్ స్టార్ ప్లేయర్ హెన్రిచ్ క్లాసెన్‌ను పెవిలియన్ పంపించాడు. దీంతో ఈ సీజన్‌లో తొలిసారి క్లాసెన్ 25 పరుగుల కంటే తక్కువ స్కోరుకే వెనుదిరగాల్సి వచ్చింది. కీలకప్లేయర్ క్లాసెన్ త్వరగా ఔట్ కావడంతో సన్ రైజర్స్ హైదరాబాద్ కుప్పకూలిపోయింది.



సన్‌రైజర్స్ హైదరాబాద్ ఇన్నింగ్స్ సందర్భంగా కామెరూన్ గ్రీన్ వేసిన 11వ ఓవర్‌లో పోవెల్ సూపర్ క్యాచ్ పట్టాడు. ఈ ఓవర్ నాలుగో బంతిని క్లాసెన్.. డీప్ మిడ్ వికెట్ దిశగా భారీ షాట్ ఆడాడు. సమీపంలో ఫీల్డింగ్ చేస్తున్న పోవెల్ తన కుడివైపు పరుగెత్తి గాల్లోకి జంప్ చేసి సింగిల్ హ్యాండ్ క్యాచ్ అందుకున్నాడు. బ్యాలెన్స్ కోల్పోయి కిందపడినా.. బంతిని మాత్రం వదల్లేదు. ఇది క్లియర్ క్యాచా.. కాదా అని పలు యాంగిల్స్‌లో రిప్లేలను పరిశీలించిన థర్డ్ అంపైర్.. చివరకు ఔట్ అని ప్రకటించాడు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.ఈ క్యాచ్ చూసిన అభిమానులు.. రోవ్‌మన్ పావెల్ కాదు.. సూపర్ మ్యాన్ పావెల్ అని కామెంట్లు చేస్తున్నారు. మరికొందరు నెటిజన్లు.. ఇది క్యాచ్ ఆఫ్ ది టోర్నీ అని పేర్కొంటున్నారు.కాగా ఈ సీజన్‌లో హెన్రిచ్ క్లాసెన్ .. 25 రన్స్ కంటే తక్కువ స్కోరుకు ఔట్ కావడం ఇదే తొలిసారి కావడం గమ నార్హం. ఓవరాల్‌గా చూసుకుంటే.. క్లాసెన్ వరుసగా 13 ఐపీఎల్ మ్యాచ్‌లలో 20ం స్కోర్లు నమోదు చేశాడు. మరో నాలుగు మ్యాచులలో అతడు 20కి పైగా రన్స్ చేస్తే.. ఐపీఎల్‌లో వరుసగా అత్యధిక సార్లు ఈ ఫీట్ సాధించిన ప్లేయర్‌గా నిలిచే వాడు. ఈ జాబితాలో సూర్యకుమార్ యాదవ్.. అగ్రస్థానంలో ఉన్నాడు. గత సీజన్‌లో అతడు వరుసగా 16 ఐపీఎల్ మ్యాచ్‌లలో 20ం స్కోర్లు నమోదు చేశాడు. హెన్రిచ్ క్లాసెన్ 13 సార్లు ఈ ఫీట్ సాధించాడు. శిఖర్ ధావన్ (11 సార్లు), రాబిన్ ఉతప్ప (10 సార్లు), సాయి సుదర్శన్ (10 సార్లు) ఈ జాబితాలో తర్వాతి స్థానాల్లో ఉన్నారు.



## యశ్‌తో బోల్డ్ సీన్స్.. తొలగించాలంటూ హీరోయిన్ రిక్వెస్ట్!

కేజీయఫ్ 2 లాంటి బ్లాక్ బస్టర్ హిట్ తర్వాత కన్నడ స్టార్ యశ్ నటించిన పాన్ వరల్డ్ చిత్రం టాక్సిక్. గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం మార్చిలోనే విడుదల కావాల్సింది. కానీ చివరి నిమిషంలో జూన్ 4వ తేదికి వాయిదా వేశారు. ఇప్పుడు జూన్‌లో కూడా ఈ చిత్రం విడుదల కావడం లేదు. సినిమా ఔట్‌పుట్ బాగా వచ్చిందని..ప్రపంచ వ్యాప్తంగా పెద్ద ఎత్తున రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారట. సినిమా ప్రమోషన్స్ కోసమే వాయిదా వేస్తున్నట్లు యశ్ ప్రకటించారు. కొత్త తేదిని త్వరలో ప్రకటించనున్నారు. ఇదిలా ఉంటే.. ఈ సినిమాకు సంబంధించి ఓ క్రేజీ గాసిప్ నెట్టింట వైరల్ అవుతుంది. ఈ సినిమాలో హీరోయిన్‌గా నటించిన బాలీవుడ్ బ్యూటీ కియారా అద్వానీ.. చిత్రబృందానికి వింత విజ్ఞప్తి చేసిందట. షూటింగ్ సమయంలో కథ డిమాండ్ మేరకు యశ్, కియారాల మధ్య కొన్ని బోల్డ్ సీన్లు చిత్రీకరించారట. ఇలాంటి సన్నివేశాలు ఉంటాయని కియారాకి ముందే చెప్పారట. ఆమె అన్నింటికి ఒప్పుకొనే సినిమాకు సైన్ చేసిందట. ఇష్టంతోనే బోల్డ్ సీన్లు చేసినప్పటికీ.. ఫైనల్ కట్ చూసి ఇప్పుడు ఆమె అభ్యంతరం వ్యక్తం చేసినట్లు సమాచారం. బోల్డ్ సీన్లు తెరపై మరింత ఘటూగా ఉన్నాయని..వాటిని అలాగే చూపిస్తే తన ఇమేజ్‌పై ప్రభావం పడుతుందని భయపడుతుందట. అందుకే వాటిని తొలగించడా లేదా నిడివి తగ్గించే ప్రయత్నం చేయమని దర్శకురాలికి రిక్వెస్ట్ చేసినట్లు బాలీవుడ్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. అయితే ఆయా సన్నివేశాలు కథకి చాలా కీలకమని..వాటిని తొలగిస్తే సినిమాలోని భావోద్వేగ తీవ్రత తగ్గుతుందని భావిస్తున్నారట. మరి కియారా రిక్వెస్ట్ మేరకు ఆ సీన్లను తొలగిస్తారా లేదా అలానే ఉంచుతారా అనేది తెలియాలంటే రిలీజ్ వరకు ఎదురు చూడాల్సిందే.

## గ్లామర్ పాత్రలకు బ్రేక్ .. శ్రీలీల కెరీర్‌లో కొత్త మలుపు

టాలీవుడ్‌లో తక్కువ కాలంలోనే స్టార్ హీరోయిన్‌గా గుర్తింపు తెచ్చుకున్న శ్రీలీల ఇప్పుడు తన కెరీర్‌లో కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. 'పెళ్లిసందడి' సినిమాతో అలరించిన ఆమె, అద్భుతమైన డాన్స్, ఆకట్టుకునే నటనతో యువతలో మంచి ఫాలోయింగ్ సంపాదించుకుంది. వరుసగా స్టార్ హీరోల సరసన నటిస్తూ కెరీర్ గ్రాఫ్‌ను వేగంగా పెంచుకున్నప్పటికీ, ఇటీవల ఆమె నటించిన కొన్ని భారీ సినిమాలు ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయాయి. ఈ నేపథ్యంలో శ్రీలీల తన రూట్‌ను మార్చుకోవాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు గ్లామర్, కమర్షియల్ పాత్రలకు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చిన ఆమె, ఇకపై బలమైన కథాంశం ఉన్న సినిమాలపై దృష్టి పెట్టాలని భావిస్తోంది. ముఖ్యంగా కుటుంబ కథా చిత్రాలు, భావోద్వేగాలకు ప్రాధాన్యం ఉన్న పాత్రల్లో నటించాలని తన కోరికను వెల్లడించింది. ఇక ప్రస్తుతం ఈ యంగ్ హీరోయిన్ కోలీవుడ్‌పైనా ఫోకస్ పెంచింది. ఇప్పటికే 'పరాశక్తి' అనే తమిళ చిత్రంతో అక్కడి ప్రేక్షకులకు పరిచయమైన ఆమె, ఇప్పుడు ధనుష్ సరసన ఆయన 55వ చిత్రంలో నటిస్తోంది. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి. అలాగే బాలీవుడ్‌లో కూడా ఓ సినిమాతో బిజీగా ఉంది. అయితే తన కెరీర్ ప్రయాణంపై స్పందించిన శ్రీలీల, "వైవిధ్యభరితమైన పాత్రలే నటిగా నాలోని పూర్తి ప్రతిభను బయటకు తీస్తాయి. కేవలం గ్లామర్ పాత్రలకే పరిమితం కావడం ఇష్టం లేదు. ప్రేక్షకులకు గుర్తుండిపోయే పాత్రలు చేయాలనుకుంటున్నాను" అని పేర్కొంది. అందుకే ఇకపై కథల ఎంపికలో మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తానని తెలిపింది. శ్రీలీల చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఆమె తీసుకున్న ఈ కొత్త దిశలోని నిర్ణయం కెరీర్‌కు ఎంతవరకు సహాయపడుతుందో చూడాలి. అయితే నటిగా మరింత వైవిధ్యం చూపించాలని ఉన్న ఆమె తపనను అభిమానులు స్వాగతిస్తున్నారు.కాగా, శ్రీలీల చివరిగా పవన్ కళ్యాణ్ నటించిన ఉస్తాద్ భగత్ సింగ్ చిత్రంలో నటించింది. ఈ సినిమా ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయింది.



## పూజా కార్యక్రమాలతో మొదలైన గోపీచంద్ కొత్త సినిమా.. వి.వెంకట్ దర్శకత్వంలో భారీ ప్రాజెక్ట్!



యాక్షన్ హీరో గోపీచంద్ తన 34వ చిత్రాన్ని ఆదివారం నాడు పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభించారు. 'యాత్ర', 'ఆనందో బ్రహ్మ' వంటి విజయవంతమైన చిత్రాలను నిర్మించిన 70ఎఎ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి ఈ చిత్రాన్ని అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తుండగా. యాక్షన్ కొరియోగ్రాఫర్‌గా ఇండస్ట్రీలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న వి.వెంకట్, ఒక గ్రిప్పింగ్ మరియు రూటెడ్ కథతో ఈ సినిమాను వెండితెరపై ఆవిష్కరించబోతున్నారు. ఇటీవల విడుదలైన అనౌన్స్‌మెంట్ పోస్టర్ ప్రేక్షకుల్లో భారీ అంచనాలను పెంచింది. మండుతున్న ఆకాశం, ఒక కొండపై గంభీరంగా నిలబడిన బ్లాక్ పాంథర్ విజువల్స్ చూస్తుంటే, ఇది ఒక ఇంటెన్స్ మైథికల్ యాక్షన్ డ్రామా అని స్పష్టమవుతోంది. ఈ చిత్రానికి టాలీవుడ్ టాప్ టెక్నీషియన్స్ పనిచేస్తున్నారు. సామ్ సి.ఎస్ (ఝుఎ ఙూ) సంగీతాన్ని అందిస్తుండగా, శామ్‌దత్ ఐఎస్‌సి ఛాయాగ్రహణం బాధ్యతలు చేపట్టారు. జాతీయ అవార్డు గ్రహీత శ్రీకర్ ప్రసాద్ ఎడిటర్‌గా, రామకృష్ణ-మౌనిక ప్రొడక్షన్ డిజైనర్లుగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం గోపీచంద్ 'భరత వర్ష' అనే పీరియడ్ చిత్రంలో నటిస్తుండగా, ఆ సినిమా పూర్తయిన వెంటనే ఈ కొత్త ప్రాజెక్ట్ షూటింగ్ ప్రారంభం కానుంది.




## ఓటీటీకి డెకాయిట్ మూవీ..

అడివి శేష్ హీరోగా షానిల్ డియో తెరకెక్కించిన యాక్షన్ మూవీ 'డెకాయిట్'. సుప్రియ యార్లగడ్డ నిర్మించిన ఈ సినిమాలో మృణాల్ ఠాకూర్ హీరోయిన్‌గా నటించింది. ఇక ఈ మూవీని ఏప్రిల్ 10న రిలీజ్ చేశారు. ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద కలెక్షన్స్ పరంగా ?అదరగొట్టింది. తొలిరోజే రూ. 15 కోట్లతో రికార్డ్ క్రియేట్ చేసింది. అంతేకాకుండా కేవలం మూడు రోజుల్లోనే రూ.34.77 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. తాజాగా ఈ మూవీ ఓటీటీ రిలీజ్ డేట్ వచ్చేసింది. ఈ చిత్రాన్ని మే 8వ తేదీ నుంచి స్ట్రీమింగ్ చేయనున్నారు. ?అమెజాన్ ప్రైమ్ వేదికగా ఈ సినిమా అందుబాటులోకి రానుంది. ఈ విషయాన్ని అఫీషియల్‌గా ప్రకటించారు. ఈ మూవీ తెలుగుతో పాటు కన్నడ, మలయాళం, తమిళ భాషల్లో స్ట్రీమింగ్ కానుంది. కాగా.. ఈ చిత్రంలో అనురాగ్ కశ్యప్, ప్రకాశ్ రాజ్, కామాక్షి భాస్కర్ల కీలక పాత్రల్లో నటించారు.

## బ్రేకప్ తర్వాత మళ్లీ ప్రేమలో పడ్డ అక్షరా సింగ్.. కానీ ప్రియుడి పేరు మాత్రం సీక్రెట్‌గానే..!

భోజ్‌పురి సినీ పరిశ్రమలో ఒకప్పుడు హాట్ టాపిక్‌గా నిలిచిన పవన్ సింగ్- అక్షరా సింగ్ ప్రేమకథ మరోసారి వార్తల్లో నిలిచింది. గతంలో ఈ ఇద్దరి రిలేషన్‌షిప్ పెద్ద చర్చకు దారితీసిన సంగతి తెలిసిందే. అయితే ఇప్పుడు బ్రేకప్ తర్వాత అక్షరా సింగ్ మళ్లీ ప్రేమలో పడినట్లు వెల్లడించడం ఆసక్తికరంగా మారింది. ఇటీవల ఓ యూట్యూబ్ ఇంటర్వ్యూలో మాట్లాడిన అక్షరా సింగ్ తన లవ్ లైఫ్ గురించి ఓపెన్ అయ్యారు. "అవును, నేను ప్రస్తుతం ప్రేమలో ఉన్నాను" అని స్పష్టంగా చెప్పారు. అయితే ఆ ప్రేమ గురించి పూర్తి వివరాలు వెల్లడించడానికి ఇంకా సమయం ఉందని పేర్కొన్నారు. "ప్రేమ అనే పదంలోని మొదటి అక్షరం వద్దనే ఉన్నాను. పూర్తిగా అర్థం చేసుకున్న తర్వాత మరిన్ని విషయాలు చెబుతాను" అంటూ ఆసక్తికరంగా స్పందించారు. గతంలో పవన్ సింగ్‌తో అక్షరా సింగ్ ప్రేమలో ఉన్నారని, ఇద్దరూ పెళ్లి చేసుకుంటారని కూడా ప్రచారం జరిగింది. కానీ 2018లో పవన్ సింగ్ జ్యోతి సింగ్‌ను వివాహం చేసుకోవడంతో వారి బంధం ముగిసింది. అనంతరం అక్షరా సింగ్ ఆయనపై పలు ఆరోపణలు చేయడం కూడా పెద్ద చర్చకు దారితీసింది. ఇప్పుడు మళ్లీ ప్రేమలో ఉన్నానని చెప్పినప్పటికీ, తన ప్రియుడి పేరును మాత్రం అక్షరా సింగ్ వెల్లడించలేదు. "పేరు చెప్పితే దిష్టి తగులుతుందేమో అనిపిస్తోంది" అంటూ చిరునవ్వుతో సమాధానం ఇచ్చారు. ప్రస్తుతం తన ప్రేమను అర్థం చేసుకునే దశలో ఉన్నానని, భవిష్యత్తులో భాగస్వామి మనస్తత్వం తనకు సరిపోతుందా లేదా అన్నది తెలుసుకున్న తర్వాతే పెళ్లి గురించి ఆలోచిస్తానని ఆమె స్పష్టం చేశారు. మొత్తానికి, గత ప్రేమ విఫలమైనా ముందుకు సాగుతూ కొత్త జీవితాన్ని ఆహ్వానిస్తున్న అక్షరా సింగ్ నిర్ణయం అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. మరి ఈ అమ్మడు తన లవ్‌కి సంబంధించిన పూర్తి విషయాలు ఎప్పుడు బయట పెడుతుందా అని అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.



## ఓటీటీలోకి మలయాళం బ్లాక్ బస్టర్ 'భరతనాట్యం 2: మోహినియాట్టం'



మలయాళ చిత్ర పరిశ్రమలో సంచలనం సృష్టించిన బ్లాక్ బస్టర్ మూవీ 'భరతనాట్యం 2: మోహినియాట్టం' డిజిటల్ ప్రియుల ముందుకు వచ్చేస్తోంది. కృష్ణదాస్ మురళి దర్శకత్వంలో తెరకెక్కిన ఈ భారీ డార్క్ కామెడీ థ్రిల్లర్, థియేటర్లలో భారీ వసూళ్లను సాధించడమే కాకుండా సుమారు రూ.40 కోట్ల కలెక్షన్లతో బాక్సాఫీస్ వద్ద విజేతగా నిలిచింది. ఇక థియేటర్‌లలో అలరించిన ఈ చిత్రం ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ వేదికగా మే 8వ తేదీ నుంచి స్ట్రీమింగ్ కానున్నట్లు అధికారిక ప్రకటన వెలువడింది. సైజు కురుప్, సూరజ్ వెంజరమూడు, జగదీష్, వినయ్ ఫోర్ట్ వంటి హేమాహేమీలు నటించిన ఈ సినిమాలో రాపర్ బేబీ జీన్ కీలక పాత్రలో మెరిశారు. 2024లో వచ్చిన 'భారతనాట్యం' సినిమాకు ఇది సీక్వెల్. మొదటి భాగంలో భరతన్ నాయర్ కుటుంబం చుట్టూ ఉన్న రహస్యాలు, కుటుంబ గౌరవం కోసం వారు పడే ఇబ్బందులను చూపించారు. ఈ రెండో భాగం ఆ కథను మరింత ముందుకు తీసుకెళ్తుంది. భరతన్ నాయర్ మరణం తర్వాత అతని కుటుంబ సభ్యులు ఎదుర్కొనే చిత్రవిచిత్రమైన సంఘటనల చుట్టూ ఈ కథ తిరుగుతుంది. ముఖ్యంగా భరతన్ నాయర్ రెండో భార్య మరియు ఆమె పిల్లలు కథలోకి ప్రవేశించినప్పుడు అసలు గందరగోళం మొదలవుతుంది. కుటుంబ సభ్యులందరూ కలిసి తమ పూర్వీకుల ఊరికి వెళ్లాల్సి వస్తుంది. అక్కడ వారికి అనుకోని విధంగా కొన్ని వింతైన, అడపాదడపా భయపెట్టే సమస్యలు ఎదురవుతాయి. ఈ చిక్కుల నుంచి బయటపడటానికి వారు చేసే ప్రయత్నాలు, ఒకరినొకరు మోసం చేసుకోవడం, తప్పుడు నిర్ణయాలు తీసుకోవడం వంటివి సినిమాలో డార్క్ కామెడీ శైలిలో చూపించారు. అస్సలు ఊహించని పరిస్థితుల్లో ఒక నేరంలో ఇరుక్కుపోయిన ఈ కుటుంబం, తమ తెలివితేటలతో ఆ సమస్య నుండి ఎలా బయటపడింది? తమ మధ్య ఉన్న మనస్పర్థలను ఎలా పరిష్కరించుకుంది? అనేది ఈ సినిమా కథ. గత ఏప్రిల్ 10న థియేటర్లలో విడుదలైన ఈ సినిమా, విలక్షణమైన కథనంతో మలయాళ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. క్రైమ్ కామెడీ మరియు ఫ్యామిలీ డ్రామా కలయికతో రూపొందిన ఈ మూవీ ఇప్పుడు నెట్‌ఫ్లిక్స్ ద్వారా డిజిటల్ ప్రేక్షకులకు కూడా చేరువ కానుంది.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613